ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కర్నూలు
జిల్లా వార్తలు 5
బుధవారం 4 జూన్ 2025

ఆరోగ్య యోగం

- రాతి వనాలపై యోగాసనాలు
- రాక్ గార్డెన్స్‌కు భారీగా తరలివచ్చిన ప్రజలు
- వినూత్నంగా ఆలోచించిన అధికారులు



యోగా చేస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

ఓర్వకల్లు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్రలో భాగంగా జిల్లా అధికార యంత్రాంగం రోజుకో రూపంలో యోగాసనాల కార్యక్రమాలు నిర్వహిస్తోంది. నెల రోజుల పాటు జరిగే ఈ యోగాంధ్ర వేడుకలను మంగళవారం సహజ సిద్ధంగా ఏర్పడిన రాతి వనాలపై నిర్వహించారు. ఓర్వకల్లు మండలంలోని పర్యాటక కేంద్రం రాక్ గార్డెన్స్‌లో సూర్యోదయ వేళ.. కలెక్టర్ రంజిత్ బాషాతో పాటు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కర్నూలు నగరంతో పాటు ఓర్వకల్లు మండలంలోని ప్రజలు పెద్దఎత్తున పాల్గొని ఆసనాలు వేశారు. యోగా అభ్యసన విద్యార్థులతో పాటు ట్రైనర్స్, మాస్టర్ ట్రైనర్స్ వివిధ భంగిమల్లో యోగాసనాలు వేసి అబ్బురపరిచారు. రాక్ గార్డెన్స్‌లో ఉన్న పెద్ద బండరాళ్లపై వినూత్న రీతిలో యోగాసనాలు వేస్తూ 'యోగాంధ్ర' లక్ష్యాన్ని చాటి చెప్పారు.

వివరాలు 6లో...

న్యూస్ బాక్స్

ఆర్‌టీఈ నిబంధనలు పాటించాలి

కర్నూలు ఎడ్యుకేషన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేటు పాఠశాలలు 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు కేటాయించాల్సిందేనని డీఈవో శామ్యూల్ పాల్ మంగళవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. సీట్ల కేటాయింపు విషయంలో ఫిర్యాదులు తమకు వస్తున్నాయని, నిబంధనలకు విరుద్ధంగా కొనసాగితే ఆయా పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఆర్‌టీఈ నిబంధనలకు విరుద్ధంగా సీట్ల కేటాయింపులో జాప్యం చేస్తే ఉపేక్షించేది లేదన్నారు. పాఠశాలల యజమాన్యాలు 25 శాతం సీట్ల కేటాయింపు పేదలకు అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని పాఠశాలల యజమాన్యాలను ఆదేశించారు.

నేడు 'వెన్నుపోటు దినం' ర్యాలీ

కర్నూలు న్యూసిటీ, జూన్ 3(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధ్వర్యంలో కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా బుధవారం 'వెన్నుపోటు దినం' ర్యాలీ నిర్వహిస్తున్నట్లు వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు నగరంలోని గౌరీగోపాల్ హాస్పిటల్ నుంచి కలెక్టరేట్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ ఉంటుందన్నారు. ర్యాలీకి జిల్లా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని ఆయన పిలుపునిచ్చారు.

13న జడ్పీస్థాయి సంఘాల సమావేశాలు

కర్నూలు, న్యూసిటీ, జూన్ 3(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ స్థాయి సంఘాల సమావేశాలు ఈ నెల 13న నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈవో జి.నాసరరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్‌లోని మినీ సమావేశ భవనంలో ఏడు స్థాయి సంఘ సమావేశాలు నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారని తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు ఈ సమావేశాలు జరుగుతాయని సీఈఓ వెల్లడించారు.

ఏసీ, డీసీలకు విధుల కేటాయింపు

కర్నూలు న్యూసిటీ, జూన్ 3(ఆంధ్రజ్యోతి): కర్నూలు నగర పాలక సంస్థలో పని చేస్తున్న అడిషనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్లకు విధులు కేటాయిస్తూ కమిషనర్ ఎస్.రవీంద్రబాబు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు రెవెన్యూ, శానిటేషన్, టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ విభాగాలకు సంబంధించి కర్నూలు నియోజకవర్గానికి డిప్యూటీ కమిషనర్ సతీష్‌రెడ్డిని కేటాయించారు. అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవి.కృష్ణకు పాణ్యం, కోడుమూరు నియోజకవర్గాలకు సంబంధించి విధులను కేటాయించారు. అదేవిధంగా అడిషనల్ కమిషనర్‌కు అదనంగా అకౌంట్ సెక్షన్, పరిపాలన విభాగాలను అప్పగించారు. డిప్యూటీ కమిషనర్‌కు కూడా అదనంగా యుపీఏ సెక్షన్ అప్పగిస్తూ పరిపాలన సౌలభ్యం కింద కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

నాణ్యతా ప్రమాణాలు తుంగపాలు

కరువు.. వలసలతో నిత్యం తల్లడిల్లే పశ్చిమ ప్రాంతం పల్లెసీమల జీవనాడి తుంగభద్ర దిగువ కాలువ సీసీ లైనింగ్ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తుంగలో కలిపేస్తున్నారు. నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు. పది కాలాల పాటు అన్నదాతల సేవల్లో తరించాల్సిన ఆధునికీకరణ పనులు రాజకీయ జోక్యంతో ప్రమాణాలు పరిహాసం అవుతు న్నాయి. వైసీపీ హయాంలో 2022-24మధ్య జరిగిన లైనింగ్ పనుల్లో బళ్లారిలో స్థిరప డిన వైసీపీ ముఖ్యనాయకులకు సన్నిహితుడైన ఓకాంట్రాక్టర్ పెత్తనం సాగింది. కూటమి ప్రభుత్వం వచ్చినా ఆ కాంట్రాక్టరు హవా నడుస్తుందన్న ఆరోపణలున్నాయి. క్షేత్రస్థాయిలో నాణ్యతా ప్రమాణాలు పర్యవేక్షించాల్సిన టీబీపీ బోర్డు ఇంజనీర్లు కొందరు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. సీసీ లైనింగ్.. ఛీఛీ లైనింగ్‌గా మారిందనే ఆరోపణలు లేకపోలేదు. ఫేజ్-2 కింద రూ.300కోట్లలో చేపట్టిన ఎల్లెల్సీ లైనింగ్ పనుల తీరుపై 'ఆంధ్రజ్యోతి' క్షేత్రస్థాయి కథనం.

- ఫేజ్-2 కింద రూ.300 కోట్లతో ఎల్లెల్సీ కాలువ లైనింగ్
- ఆధునికీకరణ పనుల్లో నిబంధనలకు తూట్లు
- బలహీనంగా మారిన కాలువ గట్లు
- చక్రం తిప్పుతున్న నాటి కాంట్రాక్టర్
- చోద్యం చూస్తున్న టీబీపీ బోర్డు ఇంజనీర్లు
- నాటి పనులకు కూటమి ప్రభుత్వంలో బిల్లుల చెల్లింపు



ఎల్లెల్సీ కాలువకు సీసీ లైనింగ్ పనులు

కర్నూలు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ)కు తుంగభద్ర డ్యాం నుంచి 24టీఎంసీల వాటా ఉంది. ఎమ్మిగనూరు, ఆలూరు, ఆదోని, మంత్రాలయం, కోడుమూరు నియోజకవర్గాల్లో ఖరీఫ్, రబీలో 1,51,413 ఎకరాలకు సాగునీరు, ఆదోని, ఎమ్మిగనూరు మున్సిపల్ పట్టణాలతో పాటు 195 గ్రామాలకు తాగునీరు అందాల్సి ఉంది. 0/0 నుంచి 241కిలోమీటర్ల వరకు టీబీపీ బోర్డు పర్యవేక్షణలో ఉంది. 70ఏళ్ల క్రితం నిర్మించిన ఎల్లెల్సీ కాలువ గట్లు పలుచోట్ల బలహీనంగా మారడం, పూడికతో నిండిపోవడంతో వాటా జలాలు అందని ద్రాక్షగా మారింది. 2022లో సీసీ లైనింగ్‌కు టీబీపీ బోర్డు శ్రీకారం చుట్టింది. ఫేజ్-1కింద రూ.519.80 కోట్లతో ఆధునికీకరణ పనులు 11ప్యాకేజీలుగా విభజించి చేపట్టారు. బడ్జెట్ కేటాయింపులు లేకున్నా అప్పటి వైసీపీ ముఖ్యనాయకులు ప్రోద్బలంతో పనులు చేపట్టడమే కాకుండా టెండర్లల్లోనే అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. బోర్డు క్వాలిటీ కంట్రోల్ ఇంజనీర్లు నామమాత్రపు తనిఖీలతో సరిపుచ్చి.. మామూళ్లు పుచ్చుకొని అంతా బాగుందని సర్టిఫికెట్ ఇచ్చినట్లు తెలుస్తుంది. వైసీపీ హయాంలో పనులు చేసినా.. కూటమి ప్రభుత్వం వచ్చాక దాదాపు రూ.275కోట్లు బిల్లులు చెల్లించారు. 2023 జనవరిలో రెండోవిడత కింద ఎల్లెల్సీ కాలువ 205కి.మీ నుంచి 250 కిలోమీటర్ల వరకు రూ.300 కోట్లు, హెచ్చెల్సీ పరిధిలో రూ.100కోట్లు కలిపి రూ.400కోట్లతో ఆర్‌సీసీ లైనింగ్ పనులు 13 ప్యాకేజీలుగా విభజించి టెండర్లు పిలిచారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు వైసీపీ హయాంలో బిల్లులు రావని మొదలు పెట్టలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక వీటిని రద్దు చేసి తిరిగి టెండర్లు నిర్వహించాలని బళ్లారికి చెందిన ఓ కాంట్రాక్టర్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. నాటి వైసీపీ హయాంలో చక్రం తిప్పిన వైసీపీ రంగు పూసుకున్న కాంట్రాక్టరే.. కూటమి ప్రభుత్వంలో కూడా చక్రం తిప్పి పనులు రద్దు కాకుండా చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఆపనుల్లో నిబంధనలు తుంగలో కలిపేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పనులు పరిశీలిస్తే వాస్తవాలు..

ఎల్లెల్సీ ఆర్‌సీసీ లైనింగ్ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తుంగలో కలిపేస్తున్నారు. పనులు జరుగుతున్న తీరు పరిశీలిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి. టీబీపీ ఇంజనీర్లతో పాటుగా నాణ్యత తనిఖీ కోసం థర్డ్ పార్టీకి చెందిన రెండు ప్రైవేటు సంస్థలకు అప్పగించినా ఫలితం శూన్యమే అనిపిస్తుంది. కాంట్రాక్ట్ ఒప్పందం మేరకు కాలువ గట్టు స్లోప్‌ను ఎర్రమట్టితో నింపి గట్టిపడేలా స్లోప్ రోలింగ్ చేయాలి.

(మిగతా 6లో..)

స్థిరంగా పత్తి ధరలు



ఆదోని అగ్రికల్చర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తి ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయి. మంగళవారం పత్తి ధర క్వింటం గరిష్ఠంగా రూ.7,929 పలికింది. ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్న సమయంలో పత్తి ధరలు రైతులు పెరుగుతాయని రైతులు ఆశించారు. ధరలు పెరగకపోవడంతో పత్తి రైతులు నిరాశ చెందుతున్నారు. కాగా మంగళవారం ఆదోని మార్కెట్‌కు 163 క్వింటాళ్లు విక్రయానికి రాగా వాటి కనిష్ఠ ధర రూ.6,009 గరిష్ఠంగా రూ.7,929, మధ్యస్థంగా రూ.7,620 పలికింది.

15 నుంచి సబ్సిడీ విత్తనాలు

కర్నూలు అగ్రికల్చర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్ మొదలు నేపథ్యంలో ఈనెల 15వ తేదీ నుంచి సబ్సిడీపై విత్తనాలను పంపిణీ చేయనున్నట్లు వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి తెలిపారు. వివిధ పంటలకు సంబంధించి 19,027 క్వింటాళ్ల వివిధ రకాల సబ్సిడీ విత్తనాలను రైతులకు అందించేందుకు ఏపీ సీడ్స్ సంస్థ చర్యలు చేపట్టిందన్నారు. ఈ మేరకు మంగళవారం ఆమె వివరాలను వెల్లడించారు. వేరుశనగ 11,108 క్వింటాళ్లు, కంది 3,442 క్వింటాళ్లు, మినుములు 70 క్వింటాళ్లు, పెసలు 30 క్వింటాళ్లు, కొర్రలు 165 క్వింటాళ్లు, వరి 300 క్వింటాళ్లను రాయితీపై రైతులకు పంపిణీ చేస్తామన్నారు. రైతులు గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. కర్నూలు జిల్లాకు 10,261 క్వింటాళ్లు, నంద్యాల జిల్లాకు 8,766 క్వింటాళ్ల విత్తనాలను ప్రభుత్వం కేటాయించిందన్నారు.

నేడు స్కూల్ అసిస్టెంట్లకు వెబ్ ఆప్షన్లు

కర్నూలు ఎడ్యుకేషన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా స్కూల్ అసిస్టెంట్లు అన్ని కేటగిరీల వెబ్ ఆప్షన్లు ప్రారంభమయ్యాయని కర్నూలు జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. శామ్యూల్ పాల్ మంగళవారం తెలిపారు. బదిలీలకు దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులందరూ వెబ్ ఆప్షన్లను నమోదు చేసుకోవాలని సూచించారు. వెబ్ ఆప్షన్లు బుధవారం సాయంత్రం 5 గంటల లోపు పూర్తి చేయాలని ఆయన తెలిపారు.

రేషన్ సరుకుల పంపిణీలో ప్రథమ స్థానం

కర్నూలు కలెక్టరేట్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): జూన్ 2వ తేదీ నాటికి ఎఫ్‌పీ షాపుల ద్వారా 2,42,975 మంది కార్డుదారులకు రేషన్ సరుకులు పంపిణీ చేసి రాష్ట్రంలో కర్నూలు జిల్లా మొదటి స్థానంలో నిలిచిందని కలెక్టర్ రంజిత్ బాషా తెలిపారు. ఎండీయూ రేషన్ వాహనాల ద్వారా ఏప్రిల్ నెలలో రెండో తేదీ నాటికి 1,10,574 మందికి, మే నెలలో 2వ తేదీ నాటికి 1,29,218 కార్డుదారులకు రేషన్ సరుకులు పంపిణీ చేయగా, ఈ నెలలో రేషన్ షాపుల ద్వారా 2,42,975 మంది కార్డుదారులకు రేషన్ సరుకులు పంపిణీ చేసినట్లు తెలిపారు. గతంతో పోలిస్తే జూన్ నెలలో రెట్టింపు కార్డుదారులకు ఎఫ్‌పీ షాపుల ద్వారా రేషన్ సరుకులు పంపిణీ చేసినట్లు తెలిపారు.


సరుకుల పంపిణీ వేగంగా పూర్తిచేయండి

- వెనుకబడ్డ మద్దికెర మండలం
- సీఎస్‌డీటీకి షోకాజ్ నోటీసు జారీచేయండి
- ఉదయం 8గంటలకు రేషన్ దుకాణాలు తెరవాలి
- తహసీల్దార్లు పర్యవేక్షించాలి
- ఫిర్యాదులు వస్తే డీలర్లపై చర్యలు తప్పవు
- కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రేషన్ సరుకులను వేగంగా పంపిణీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రంజిత్‌బాషా తహసీల్దార్లను ఆదేశించారు. మంగళవారం ఆర్డీవోలు, తహసీల్దార్లు, పౌరసరఫరాల శాఖ అధికారులతో రేషన్ సరుకుల పంపిణీపై కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ కార్డుదారులకు సరుకుల పంపిణీలో మద్దికెర మండలం పూర్తిగా వెనుకబడి ఉందన్నారు. దీంతో సీఎస్‌డీటీ(సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్)కి షోకాజ్ నోటీసు జారీ చేయాలని కలెక్టర్ తహసీల్దార్‌ను ఆదేశించారు. ఓర్వకల్లు, ఆదోని, కర్నూలు అర్బన్, సి.బెళగల్, క్రిష్ణగిరి మండలాలు సైతం సరుకుల పంపిణీలో వెనుకబడ్డాయని అన్నారు. 65 సంవత్సరాలు పైబడిన వారు, దివ్యాంగులు, మంచానికి పరిమితమైన కార్డుదారులు చౌకదుకాణాలకు రావాల్సిన అవసరం లేదన్నారు. వీరికి ఇంటికి వద్దనే ఎఫ్‌పీ షాపు డీలర్లు వచ్చి సరుకులు అందిస్తారన్నారు. ఉదయం 8 గంటలకు రేషన్ దుకాణాలు తప్పనిసరిగా తెరవాలన్నారు. తహసీల్దార్లు రేషన్ షాపులను పర్యవేక్షించాలన్నారు. మొదటి 5 రోజులు తహసీల్దార్లు ప్రతిరోజు ఎఫ్‌పీ డీలర్లతో సమీక్ష చేయాలని సూచించారు. రేషన్ సరుకుల పంపిణీలో ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకూడదని, ఫిర్యాదులు వస్తే డీలర్ల మీద చర్యలు తప్పవని హెచ్చరించారు. టెలి కాన్ఫరెన్స్‌లో జేసీ డా.బి. నవ్య, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్, ఆర్డీవోలు సందీప్‌కుమార్, భరత్‌నాయక్, డీఎస్‌వో రఘువీర్ పాల్గొన్నారు.



భూమి సత్తువకు పచ్చి రొట్ట 6
మరో ఇద్దరికి కరోనా.. ఓ డాక్టర్, 25 ఏళ్ల మహిళకు నిర్ధారణ 7
ప్రభుత్వ నివాస గృహాల ఆక్రమణపై ఉప లోకాయుక్త ఆగ్రహం 7
పెద్దపులుల సంఖ్య 95



రాతివనాల్లో విద్యార్థుల యోగా

ఆరోగ్యయోగం

5వ పేజీ తరువాయి

యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా జిల్లా పర్యాటక శాఖ టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ ముంతాజ్ బేగ్, డివిజనల్ మేనేజర్ లక్ష్మినారాయణ ఆధ్వర్యంలో ఓర్వకల్లులోని రాక్‌గార్డెన్ వద్ద నిర్వహించిన యోగా కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఈకార్యక్రమంలో దాదాపు వేయి మంది యోగా అభ్యాసకులు పాల్గొని యోగాసనాలు చేశారు. వీరికి మాస్టర్ ట్రైనర్లు యోగాసనాలపై అవగాహన, శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, జాయింట్ కలెక్టర్ డా.బి. నవ్య హాజరయ్యారు. యోగాసనాలను వీక్షించేందుకు ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. రాతివనాల్లోని కొండలపై కూర్చుని తిలకించారు. పొదుపులక్ష్మి మండల ఐక్య సంఘం ఆధ్వర్యంలో ప్రజలకు అల్పాహారాన్ని ఏర్పాటు చేశారు. కొండల్లో యోగాసనాలు ప్రజలను ఎంతగానో ఆకట్టుకున్నాయి. రాష్ట్ర యోగా సంఘం ప్రధాన కార్యదర్శి అవినాష్ శెట్టి, యోగా గురువులు మునిస్వామి, విజయకుమార్ ఆధ్వర్యంలో యోగా ప్రొటోకాల్ ప్రకారం దాదాపు గంటపాటు యోగాసనాలు చేయించారు. ఈ కార్యక్రమంలో మండల సమైఖ్య గౌరవసలహాదారాలు విజయభారతి, జాయింట్ కలెక్టర్ బి. నవ్య, టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ ముంతాజ్ బేగ్, కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, జడ్పీ సీఈవో నాసరరెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసులు, తహసీల్దార్ విద్యాసాగర్, ఆయూష్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రసాద్, టీడీపీ నాయకులు గోవిందరెడ్డి, మోహన్ రెడ్డి, చదువుల సుధాకర్ రెడ్డి, విశ్వేశ్వరరెడ్డి, సుధాకర్‌రావు, ఏపీ టూరిజం యూనిట్ మేనేజర్ జీవన్, వ్యాఖ్యాత డాక్టర్ మద్దకంటి చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

దినచర్యలో భాగం కావాలి

- రంజిత్ బాషా, కలెక్టర్, కర్నూలు



దినచర్యలో యోగా ఒక భాగంగా మారితే.. ఇంటిల్లిపాదికి ఆనందం, ఆరోగ్యభాగ్యం సొంతమవుతుంది. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా జూన్ 21న నిర్వహిస్తున్న ప్రపంచ యోగా దినోత్సవంలో కర్నూలు జిల్లాలో 10 లక్షల మంది పాల్గొనే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. యోగాంధ్రలో భాగంగా ఇప్పటికే ట్రైనర్లకు శిక్షణా కార్యక్రమాలు పూర్తి అయ్యాయి. ప్రస్తుతం గ్రామ స్థాయిలో పోటీ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ప్రసిద్ధి చెందిన పర్యాటక ప్రాంతాల్లో యోగా నిర్వహించాలనే థీమ్‌లో భాగంగా ఓర్వకల్లు రాక్‌గార్డెన్ వద్ద యోగా కార్యక్రమాలు జరుపుకుంటున్నాం. జూన్ 12న కొండారెడ్డి బురుజు వద్ద, 18న మంత్రాలయంలో యోగా కార్యక్రమాలు నిర్వహిస్తాం. 5వేల మంది పారిశుధ్య కార్మికులతో జూన్ 17న కర్నూలులో యోగా కార్యక్రమం నిర్వహించేలా ప్లాన్ చేశాం.

యోగా కోసం సమయాన్ని కేటాయించండి

- గౌరు చరిత, ఎమ్మెల్యే, పాణ్యం



ప్రతి ఒక్కరూ రోజులో కొంత సమయాన్ని యోగా కోసం కేటాయించండి. యోగాతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. యోగా గురించి దేశప్రజలందరికీ తెలియజేస్తూ, అందరినీ యోగాలో భాగస్వాములు చేయాలనే ఉద్దేశంతో ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు 'యోగాంధ్ర'కు శ్రీకారం చుట్టారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జూన్ 21న వైజాగ్‌లో నిర్వహించనున్న యోగా దినోత్సవం కార్యక్రమానికి ప్రధాన మంత్రి నరేంద్రమోదీ హాజరవుతారు.



సూర్య నమస్కారాలు చేస్తున్న జేసీ నవ్య



రాతి వనాల్లో చిన్నారుల యోగాసనాలు

భూమి సత్తువకు పచ్చిరొట్ట

- సేంద్రియ పదార్థాలతో సూక్ష్మధాతువుల వృద్ధి
- జీలుగ, జనుము, పిల్లిపెసర సాగుతో భూమి సారవంతం
- జిల్లాకు 3023 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు మంజూరు

ఆత్మకూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ, సహజ సిద్ధమైన పచ్చిరొట్ట ఎరువులను ఉపయోగిస్తే ఈ విపత్తులు లేకపోగా పంట దిగుబడి బాగా పెరుగుతుంది. పచ్చిరొట్ట ఎరువులు అతితక్కువ ఖర్చులతో తయారు చేసుకోవచ్చునని కూడా వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. తొలికరి వర్షాలు పడగానే పచ్చిరొట్ట విత్తనాలను వేసుకోవాలి. నీటి వసతి ఉన్నట్లయితే వేసవిలోనే సాగుచేసుకోవడం లాభాదాయకం. పసుపు, కంది, చెరుకు వంటి పంటల మధ్య పచ్చిరొట్ట పైర్లను పూతదశలోనే కలియదున్నుకోవాలి.



జీలుగ సాగు



పచ్చిరొట్ట పైర్లలో 16 రకాలు ఉంటాయి. ఇందులో జీలుగ, అవిశ, జనుము, వెంపల్లి, అలసంద, పిల్లిపెసర, పెసర, మినుము, గోరు చిక్కుడు, అజొల్లా, కానుక, వేప, గ్లైసిడియా, జిల్లేడు, నేల తంగేడు, కొండ మిరుప తదితర రకాలు ఉన్నాయి. వరితో పాటు ఏపంట సాగుచేసినా నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువులు అవసరం. ఇవి పచ్చిరొట్ట సాగు చేయడం వల్ల పంటకు పుష్కలంగా సమకూర్చుకునే అవకాశం ఉంటుంది.

పచ్చిరొట్ట ఎరువులతో ప్రయోజనాలు



జనుము సాగు

- పచ్చిరొట్ట పైర్లను పొలంలోనే కలియదున్నడం వల్ల సూక్ష్మజీవులు అధికంగా వృద్ధి చెందుతాయి. భూసారం పెరుగుతోంది.
- భూమిని గుల్లపరిచి నీటినిల్వ సామర్థ్యం అధికం అవుతోంది.
- భూమిలో లభ్యం కాని రూపంలో ఉండే అనేక పోషకాలను లభ్య రూపంలోకి మారుస్తాయి.
- పచ్చిరొట్టతో భాస్వరం, గంధకం లభ్యత చాలా పెరుగుతోంది.

జిల్లాకు 3023 క్వింటాళ్ల సబ్సిడీ జీలుగ విత్తనాలు కేటాయింపు



పచ్చిరొట్ట ఎరువులను నీటిలో మురిగిస్తున్న దృశ్యం

నంద్యాల జిల్లాకు సంబంధించి 27 మండలాలకు ప్రస్తుతం 3023 క్వింటాళ్ల సబ్సిడీ జీలుగ విత్తనాలను కేటాయించినట్లు తెలిసింది. అయితే ఢిల్లీ నుంచి ఈ విత్తనాలను దిగుమతి చేసుకోవాల్సి ఉండటంతో ఇప్పటివరకు కేవలం 1200 క్వింటాళ్లు మాత్రమే జిల్లాకు చేరాయి.

రొట్ట పంటలు సాగు విధానం



జీలుగ పంటను పొలంలో కలియదున్నుతున్న దృశ్యం

జీలుగ పంటను చౌడు, వరి పండించే భూముల్లో సాగు చేసినట్లయితే మంచి ఫలితాలు ఉంటాయి. ఎకరానికి 20కిలోల విత్తనాలు అవసరమవుతాయి. జనుము సాగుచేసేందుకు ఎకరాకు 9 నుంచి 14కిలోల విత్తనాలు అవసరం ఉంటాయి. దీని ద్వారా ఎకరానికి 5 నుంచి 6టన్నుల పచ్చిరొట్ట లభిస్తోంది. పెసర, మినుము పచ్చిరొట్టతో ఎకరానికి 15 నుంచి 20కిలోల యూరియా లభిస్తోంది. అవిశ పంటకు ఎకరానికి 16కేజీల విత్తనాలు అవసరమవుతాయి. దీని ద్వారా సుమారు 40కేజీల నత్రజని ఉత్పత్తి అవుతుంది. అలసంద సాగుకు ఎకరానికి 15కేజీల విత్తనాలు అవసరం ఉంటాయి. ఈమొక్కలను పొలంలోనే కలియున్నితే 60కేజీల వరకు నత్రజని ఉత్పత్తి అవుతుంది. పిల్లిపెసర ఎకరానికి కేవలం 6కేజీల విత్తనాలు సరిపోతాయి. దీనిద్వారా ఏకంగా 40కేజీల నత్రజని పొలంలో ఉత్పత్తి చేసుకోవచ్చు.

రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలి



ఆత్మకూరు వ్యవసాయ డివిజన్ పరిధిలో ఈఏడాది ఖరీఫ్‌కు 350 క్వింటాళ్ల జీలుగ విత్తనాల కేటాయించారు. ఈ వారంలో విత్తనాలు అందుబాటులోకి వస్తాయి. గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో పట్టాదారు పాస్ బుక్, ఆధార్, ఫోన్ నంబర్‌తో రిజిస్టర్ చేసుకోవాలి.

● ఆంజనేయులు, ఏడీఏ, ఆత్మకూరు

ఆర్‌యూలో 17 నుంచి 'యోగాంధ్ర'

కర్నూలు అర్బన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీలో ఈనెల 17 నుంచి 21వ తేదీ వరకు యోగాపై వర్క్‌షాప్ నిర్వహిస్తామని ఉపకులపతి వి.వెంకట బసవరావు తెలిపారు. మంగళవారం రాయలసీమ యూనివర్సిటీలోని ఆయన చాంబర్లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. యోగాపై పలువురు నిపుణులతో కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈనెల 21 వరకు యోగాపై కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. వర్సిటీ సెంట్రల్ లైబ్రరీ వద్ద నిర్వహించిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో విద్యార్థులు పచ్చదనం, పరిశుభ్రతపై ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. యోగాతో మానసిక ప్రశాంతతో పాటు శారీరక ఆరోగ్యం సాధ్యమవుతుందన్నారు. ప్రతి ఒక్కరూ యోగా విద్యను అభ్యసించాలన్నారు.

డిగ్రీ సర్టిఫికెట్లకు రేపటి నుంచి దరఖాస్తులు

కర్నూలు అర్బన్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ ఒరిజినల్ సర్టిఫికెట్ల కోసం గురువారం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఉపకులపతి వి.వెంకట బసవరావు తెలిపారు. విద్యార్థులు తగిన రుసుం, అవసరమైన ధ్రువపత్రాలను గెజిటెడ్ ఆఫీసర్ సంతకంతో జత చేసి దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుతో పాటు విద్యార్థి ప్రస్తుత చిరునామాతో కూడిన కవర్‌ను జత చేయాలన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు రెండు వారాల్లో సర్టిఫికెట్లను పంపిస్తామని తెలిపారు.

క్రీడా పాఠశాలకు దరఖాస్తు చేసుకోండి



మాట్లాడుతున్న ఎంఎస్‌వీరాజు

నంద్యాల హాస్పిటల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): వైఎస్సార్ కడప క్రీడా పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికిగాను 4, 5తరగతులలో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి ఎంఎస్‌వీరాజు అన్నారు. 4, 5 తరగతుల కోసం దరఖాస్తు చేసుకునేవారు 1.4.2015నుంచి 31.3.2017మధ్యలో జన్మించి ఉండాలన్నారు. అలాగే 1వ తరగతినుంచి 3వ తరగతి వరకు ప్రభుత్వ, గుర్తింపు పొందిన పాఠశాలలో తప్పనిసరిగా పాసై ఉండాలన్నారు. పంచాయతీ, మున్సిపల్, కార్పొరేషన్ జారీ చేసిన వయసు ధృవీకరణ పత్రం ఉండాలన్నారు. పేర్లు నమోదు చేసుకోవడానికి ఈ నెల 19వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. ఈ నెల 20నుంచి 25వ తేదీవరకు ఆన్‌లైన్‌లో సమర్పించిన అప్లికేషన్స్ స్క్రీనింగ్, షార్ట్‌లిస్ట్ చేసిన తర్వాత విడుదల చేసిన జాబితా ప్రకారం 1.7.2025నుంచి 3.7.2025వరకు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే జిల్లా స్థాయి ఎంపికలకు ఒరిజినల్ పత్రాలతో హాజరు కావాల్సి ఉంటుందని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన విద్యార్థులు జూలై 10, 11తేదీల్లో రాష్ట్ర స్థాయి ఎంపికకు హాజరు కావాలని తెలిపారు.

'సీమ' అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం: టీజీ భరత్



పోస్టర్ విడుదల చేస్తున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు అర్బన్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): రాయలసీమను అన్నివిధాలా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. మంగళవారం మంగళగిరిలోని ఏపీఐఐసీ కార్యాలయంలో మంత్రి టీజీ భరత్ విజయవాడ-కర్నూలు విమాన సర్వీసుల షెడ్యూల్ పోస్టర్‌ను విడుదల చేశారు. జూలై 2న విజయవాడ నుంచి కర్నూలు జిల్లా ఓర్వకల్లు విమానా శ్రయానికి విమాన సర్వీసులు నడిపేందుకు ఇటీవలే కేంద్ర విమానయాన శాఖ అంగీకరించిందని తెలిపారు. మొదటగా ప్రతి సోమ, బుధ, శుక్రవారాల్లో ఈ విమాన సర్వీసు నడుస్తుందని ఇండిగో ప్రతినిధులు తెలిపారు. విజయవాడలో మధ్యాహ్నం 3.45 గంటలకు బయలు దేరి ఓర్వకల్లుకు 4.50 గంటలకు చేరుకుంటుందని, 5.10 గంటలకు ఓర్వకల్లుఓ బయలు దేరి విజయవాడకు 6.15కు చేరుకుంటుందని, విమాన టికెట్ ధర రూ. 2,533 నుంచి మొదలవుతాయని చెప్పారు. అనంతరం మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ రాయలసీమలో భారీగా పరిశ్రమలు రానున్నాయని అన్నారు. లేపాక్షి నుంచి కొప్పర్తి, ఓర్వకల్లు వరకు ఇండస్ట్రియల్ కారిడార్ ఎంతో అభివృద్ధి చెందనుందని తెలిపారు. ఈప్రాంతలో డిఫెన్స్ డ్రోన్, ఎలక్ట్రిక్, గ్రీన్ ఎనర్జీకి సంబంధించిన పరిశ్ర మలు వస్తాయన్నారు. ఇప్పటికే వేల కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చినట్లు తెలిపారు. ఓర్వకల్లు సెమికండక్టర్ల పరిశ్రమ రాబోతుందన్నారు. ఓర్వకల్లు విమాన సర్వీసు ఉండటంతో పారిశ్రామిక వేత్తలు, సీనియర్ ఐఏఎస్ అధికారుల రాకపోకలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. త్వరలో హైకోర్టు బెంచ్ కర్నూల్లో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇండిగో విజయవాడ సేల్స్ మేనేజర్ మోహిత్ కృష్ణ, కర్నూలు సేల్స్ మేనేజర్ రవిబాబు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు తుంగపాలు



కాలువ గట్టు బలోపేతానికి వాడుతున్న నాణ్యత లేని మట్టి

5వ పేజీ తరువాయి

ఎక్కడ కూడా స్లోప్ రోలింగ్ యంత్రం కనిపించడం లేదు. ఎక్స్‌కవేటర్ (జేసీబీ) బకెట్‌తో స్లోప్ చేసి దానిపై సీసీ లైనింగ్ వేస్తున్నారు.

- అప్రూవ్డ్ క్వారీ నుంచి తెచ్చిన ఎర్రగరుసుతో గట్టు స్లోప్ చేయాల్సి ఉంటే.. కాలువ పక్కనే నల్లరేగడి పొలాలు కొనుగోలు చేసి ఆ మట్టినే తవ్వికాలువకు వాడుతున్నారు.



ఎక్స్‌కవేటర్లతో మట్టి స్లోప్ చేస్తున్న దృశ్యం

- ఇనుము కడ్డీలు(స్టీల్ బార్) మెయిన్‌బార్ (నిలువు) 10 మిల్లీ మీటర్లు, డిస్ట్రిబ్యూషన్ బార్ (అడ్డంగా) 8 మిల్లీ మీటర్లు (ఎం,ఎం) మందం కడ్డీలు వాడాలి. రెండింటికి 8 ఎం.ఎం కడ్డీలే వాడుతున్నారు. అలాగే కడ్డీకడ్డీల మధ్య బాక్స్ నిలువు 25 సెం.మీలు, అడ్డం 25 సెం.మీలు ఉండేలా స్టీల్ కడ్డీలు వాడాల్సి ఉంటే.. 40 సెం.మీలు, 45 సెం.మీలు బాక్స్‌లు కడుతున్నారు.
- ఎం-15 గ్రేడ్ రేషియో ప్రకారం 1:2:4 నిష్పత్తిన సిమెంట్, ఇసుక, కంకర వినియోగించాలి. ఒక క్యూబిక్ మీటరుకు 296 కిలోలు సిమెంట్, 600 కిలోలు ఇసుక, 900 కిలోలు కంకర వాడాల్సి ఉంది. ఇందుకు విరుద్ధంగా బల్కేజీ పేరుతో 800-900 కిలోలు ఇసుక, 1,200-1,300 కిలోలు కంకర వాడుతున్నారు. అంతేకాదు.. 4 ఇంచుల మందం సీసీ కాంక్రీట్ వేయాల్సి ఉంటే కొన్ని చోట్ల 3-3.5 ఇంచులే వేస్తున్నారు.
- ఇంజనీరింగ్ అధికారుల సిఫారసులకు విరుద్ధంగా ఆర్‌సీసీ లైనింగ్ పనులు చేస్తూ సిమెంట్, స్టీల్ 25-30 శాతాని కి పైగా పొదుపుగా పాటిస్తున్నారు. మట్టి పనుల్లోనూ ఇష్టారాజ్యంగా చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా పనులు చేస్తున్నారని క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్న ఇంజనీర్లు గాంధారిపాత్ర పోషిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

నిబంధనల మేరకే పనులు

ఎల్లెల్సీ ఆర్‌సీసీ లైనింగ్ పనులు నిబంధనల మేరకే చేస్తున్నాం. బోర్డు ఇంజనీర్లతో పాటు థర్డ్ పార్టీ క్వాలిటీ కంట్రోల్ బాధ్యతలు చూసే రెండు సంస్థలు కూడా క్షేత్రస్థాయిలో పనులు పర్యవేక్షిస్తున్నారు. ఏ కాంట్రాక్టరైనా నిబంధనలు విరుద్ధంగా పనులు చేస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటాం.

● నారాయణ నాయక్, ఎస్ఈ, టీబీపీ బోర్డు, హాస్పెట్



భగవద్గీతను బ్రెయిలీ లిపిలో అనువాదం చేసిన పుస్తకాన్ని చూపుతున్న బూర్ల లక్ష్మన్న

బూర్ల లక్ష్మన్న భళా..!

- అంధత్వాన్ని జయించిన ఉపాధ్యాయుడు
- బ్రెయిలీ లిపిలో భగవద్గీత సారాంశం అనువాదం
- రాధాకృష్ణుల ఆలయ నిర్మాణం

ఆలూరు, జూన్3(ఆంధ్రజ్యోతి): చూపులేదని దిగులు చెందలేదు. ఆత్మస్థైర్యంతో చీకటిని జయించాడు. విధిని తిట్టుకుంటూ కూర్చోలేదు. విధి రాత అని సరిపెట్టుకో లేదు. పట్టుదలతో శ్రమించి పది మందికి పాఠాలు చెప్పే స్థాయికి ఎదిగారు. కృష్ణుడి ఆలయాన్ని నిర్మించాడు.. బ్రెయిలీ లిపిలో భగవద్గీతను అనువాదించాడు ఉపాధ్యాయుడు లక్ష్మన్న. ఎందరో అంధులకు ఆదర్శంగా నిలిచారు.

అవరోధాలను అధిగమించి ఉపాధ్యాయుడిగా ఎదిగి

ఆలూరు గ్రామానికి చెందిన బూర్ల హనుమప్ప, బూర్ల నరసమ్మ దంపతులకు ముగ్గురు సంతానం. వారిలో పెద్ద కుమారుడు బూర్ల లక్ష్మన్న. పుట్టుకతోనే కంటి చూపును కోల్పోయాడు. ఆదిఆంధ్ర పాఠశాలలో ప్రాథమిక విద్యాభ్యాసం పూర్తిచేశారు. తల్లిదండ్రులు ప్రోత్సాహం, ప్రభుత్వ జూనియర్ కళాశాల తెలుగు అధ్యాపకుడు డాక్టర్ వరప్రసాద్ సహకారంతో డా.బీ.ఆర్.అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ నుంచి డిగ్రీ పట్టా పొందారు. బ్రెయిలీ లిపిలో డీఎడ్ కోర్సు పూర్తిచేసి 1993లో ఉపాధ్యాయ వృత్తిని చేపట్టారు. ఎన్నో అవరోధాలు అధిగమించి ఉపాధ్యాయుడి కొలువు సాధించారు. ప్రస్తుతం ఆలూరు మండలంలోని హాలేబీడు పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు.

జానపద సంగీతంలో పట్టు

లక్ష్మన్నకు జానపద సంగీతంలో మంచి పట్టు ఉంది. బుర్రకథలను బాగా చెప్పగలరు. భజన పోటీల్లో న్యాయ నిర్ణేతగా వ్యవహరిస్తున్నారు. అవకాశాలు ఉన్నా చాలా మంది ప్రతిభను వెలికితీసే మార్గాలు ఉన్నా వాటిని వినియోగించుకోలేక పోతున్నారు. ఎవరో వస్తారని, ఏదో చేస్తారని ఎదురు చూస్తూ కాలక్షేపం చేస్తూ తమ ఉన్న తిని తామే తుంచుకుంటున్నారు. నిరుత్సాహంతో కుంగిపోతున్నారు. అయితే ఇందుకు భిన్నంగా లక్ష్మన్న అవకాశాలు అందిపుచ్చుకున్నారు. ఉపాధ్యాయ వృత్తిని చేపట్టి వైకల్యం శరీరానికే గానీ మనస్సుకు కాదని నిరూపించారు.

సమాజం కోసం..

సమాజానికి ఏదైనా చేయాని లక్ష్మన్న సంకల్పించారు. ఈ కోవలోనే ఆలూరు పట్టణం ఎల్లార్తి రోడ్డు సమీపంలో ఐదు సెంట్ల స్థలంలో దాతల సహకారంతో రాధాకృష్ణుల దేవాలయాన్ని నిర్మించారు. అంతేకాక భగవద్గీత సారాంశాన్ని బ్రెయిలీ లిపిలో అనువదించి బెంగళూరుకు చెందిన మిత్ర జ్యోతి ట్రస్టు ద్వారా ముద్రింపజేశారు. । మహాయోగి లక్ష్మమ్మ అవ్వ జీవిత చరిత్రను సైతం బ్రెయిలీ లిపిలో రచించారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆలూరు జూనియర్ సివిల్ జడ్జి హేమ

ఆత్మస్థైర్యం ఉంటే దేనినైనా సాధించొచ్చు

ప్రతిభకు వైకల్యం అడ్డు కాకూడదు. పట్టుదల ఆత్మస్థైర్యం ఉంటే దేనినైనా సాధించొచ్చు. వైకల్యం ఉన్న వారు నిరుత్సాహ పడకుండా ముందుకు సాగాలి. ఎవరి స్థాయిలో వారు తమకు తోచిన విధంగా సహాయ సహకారాన్ని అందించాలి. ఊపిరి ఉన్నంతవరకు ఇతరులకు సహాయ పడుతా.

● బూర్ల లక్ష్మన్న, ఉపాధ్యాయుడు

ప్రభుత్వ నివాస గృహాల ఆక్రమణపై
ఉప లోకాయుక్త ఆగ్రహం

కర్నూలు లీగల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఏ, బీ, సీ క్యాంపుల్లోని ప్రభుత్వ క్వార్టర్స్‌ను కొంత మంది ఆక్రమించుకోవడంపై రాష్ట్ర ఉపలోకాయుక్త పి.రజని మంగళవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలంటూ కలెక్టర్‌ను ఆదేశించారు. నగరంలోని పలు ప్రభుత్వ క్వార్టర్స్ శిథిలావస్థకు చేరుకోవడంతో కొంతమంది ఆక్రమించుకుని నివసిస్తున్నారు. అంతేగాక వ్యాపారులకు అద్దెకు ఇచ్చి వేలాది రూపాయలు దండుకుంటున్నారని గత నెలలో పత్రికల్లో వార్తా కథనాలు వచ్చాయి. ఈ కథనాలను జతపరుస్తూ నగరానికి చెందిన కే.జగన్ అనే వ్యక్తి రాష్ట్ర ఉప లోకాయుక్తకు ఫిర్యాదు చేశాడు. దీనిపై రాష్ట ఉప లోకాయుక్త పి. రజిని స్పందిస్తూ కర్నూలు కలెక్టర్ ఒక కమిటీని వెంటనే ఏర్పాటు చేసి ఇంటింటికి తిరిగి సర్వే చేసి అక్రమార్కులను గుర్తించి అద్దెలకు ఇచ్చిన విషయాలను తెలుసుకుని అవసరమైతే కరెంటు, నీటి సరఫరాను కూడా నిలిపివేసి చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ ఈ మేరకు ఒక కమిటీని ఏర్పాటు చేసి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

కుంభకోణాల నుంచి దృష్టి మళ్లించేందుకే..



- టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి

కర్నూలు అర్బన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కుంభకోణాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు వైసీపీ నాయకులు వెన్నుపోటు దినం పేరుతో కొత్త డ్రామాకు తెరలేపారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి ధ్వజమెత్తారు. మంగళవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి అధికారాన్ని అడ్డం పెట్టుకొని లెక్కలేనన్ని కుంభకోణాలకు పాల్పడ్డారని అన్నారు. అవి ఒక్కొక్కటిగా ప్రస్తుతం బట్టబయలు అవుతుండటంతో ప్రజల దృష్టిని మరల్చేందుకు వెన్ను పోటు దినం అంటూ ధర్నాలకు దిగుతున్నారని మండి పడ్డారు. కూటమి పాలనలో తొలి ఏడాదిలోనే 70 శాతం హామీలు అమలు చేశామని, రాబోయే రోజుల్లో మిగిలినవి విడతల వారీగా అమలు చేస్తామని తెలిపారు.

కట్నం వేధింపుల కేసు నమోదు

దొర్నిపాడు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): నంద్యాలకు చెందిన సాయికుమార్‌పై అదనపు కట్నం కోసం వేధించిన కేసు నమోదైనట్లు ఎస్‌ఐ సత్యనారాయణ మంగళవారం తెలిపారు. గుండుపాపల గ్రామానికి చెందిన ఏ.శ్వేతకు 2021లో నంద్యాల టౌన్‌కు చెందిన సాయికుమార్‌తో వివాహం జరిగింది. కొద్ది రోజులుగా అదనపు కట్నం తేవాలని భర్త తనను వేధిస్తున్నాడని శ్వేత ఫిర్యాదు చేసిందని ఆయన తెలిపారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు దొర్నిపాడు ఎస్‌ఐ తెలిపారు.

ట్రాక్టర్ ట్రాలీ బోల్తా..

- ఇద్దరు కార్మికుల మృతి

బనగానపల్లె, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె మండలం నందివర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని నందివర్గం - కొత్తూరు గ్రామాల మధ్య నాపరాయి ట్రాక్టర్ బోల్తా పడడడంతో ఇరువురు గని కార్మికులు మంగళవారం మృతి చెందారు. మండలంలోని పలుకూరు గ్రామం నుంచి నాపరాయిని ట్రాక్టర్ ట్రాలీలో నంద్యాల వైపు తరలిస్తుండగా ఈ ప్రమాదం సంభవించింది. పలుకూరు నుంచి నాపరాళ్లతో వెళుతున్న ట్రాక్టర్ నందివర్గం దాటి కొత్తూరు మీదుగా నంద్యాల వైపుకు వెళ్తుండగా నాపరాయి ట్రాక్టర్ అదుపు తప్పి అకస్మాత్తుగా బోల్తా పడడంతో నాపరాళ్ల కింద పడి పలుకూరు గ్రామానికి చెందిన ముక్కమళ్ల శివారెడ్డి(50) అక్కడికక్కడే మృతి చెందాడు. నందవరం గ్రామానికి చెందిన అబ్దుల్‌రసూల్(50)పై నాపరాళ్లు పడడంతో రెండు కాళ్లు విరిగి తీవ్ర రక్తస్రావం అయింది. ఆయనను 108 వాహనంలో బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. నందివర్గం పోలీసులు, ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని పరిశీలించారు. మృతదేహాలను బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టానికి తరలించారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చెట్టుపై నుంచి పడి వ్యక్తి మృతి

ఆత్మకూరు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాత రఘునాథ్ థియేటర్ సమీపంలో నివాసముంటున్న మహ్మద్ ఇలియాస్ (34) అనే వ్యక్తి చెట్టు మీద నుంచి కింద పడి మృతి చెందిన ఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగు చూసింది. మహ్మద్ ఇలియాస్ సోమవారం తన ఇంటి పరిసరాల్లో ఉన్న నేరెడు చెట్టు ఎక్కి పండ్లను తెంచే క్రమంలో చెట్టు కొమ్మ విరిగి కిందపడటంతో తీవ్రంగా గాయపడ్డారు. దీంతో కుటుంబ సభ్యులు ఆయన్ని ఆత్మకూరులో ఓ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ఇక్కడి వైద్యులు కర్నూలు రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. మహ్మద్ ఇలియాస్‌కు భార్య, ఇద్దరు పిల్లలు సంతానం ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..

చాగలమర్రి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన మంగళవారం మండలంలోని గొడిగనూరు గ్రామ సమీపంలో చోటుచేసుకున్నట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు. వివరాలు.. మండలంలోని డి.వనిపెంట గ్రామానికి చెందిన శ్రీహరి (23) అనే యువకుడు మంగళవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. చాగలమర్రి గ్రామంలో ఓ మిల్లులో కూలీ పని చేసి బైక్‌పై ఇంటికి వెళ్తున్నాడు. గొడిగనూరు గ్రామ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. గాయపడ్డ శ్రీహరిని గమనించిన కొందరు వ్యక్తులు చికిత్స నిమిత్తం స్థానిక కేరళ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ, ఏఎస్‌ఐ ఆస్పత్రికి చేరుకొని ఘటన గురించి ఆరా తీశారు. ఆవాహనం కోసం గాలింపు చర్యలు చేపట్టారు. కుటుంబానికి ఆసరాగా ఉన్న శ్రీహరి మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆళ్లగడ్డ వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మహిళ బలవన్మరణం

అవుకు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఉరేసుకొని ఓ మహిళ బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన మండలంలోని రామవరంలో గ్రామంలో చోటుచేసుకున్నట్లు ఎస్‌ఐ రాజారెడ్డి తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన సుద్దల శిరీష(26) అనే మహిళ మంగళవారం ఇంట్లో ఉరేసుకుంది. భర్త వెంకటేశ్వర్లు మద్యానికి బానిస కావడంతో మనస్థాపం చెంది ఉరేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అవుకు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతురాలికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

గడ్డి వాములు దగ్ధం

పత్తికొండ టౌన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జె.అగ్రహారం గ్రామంలో గడ్డివాములు దగ్ధమయ్యాయి. బాధితుల కథనం మేరకు.. అన్నదమ్ములు రామచంద్ర, లక్ష్మన్న ఇంటి పక్కనే వామిదొడ్లు ఏర్పాటు చేసుకున్నారు. మంగళవారం ఉదయం 10 గంటల సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో నిప్పు వచ్చి గడ్డిమీద పడటంతో మంటలు వ్యాపించాయి. అగ్నిమాపక సిబ్బంది చేరుకుని ప్రయత్నించినా అప్పటికే పశుగ్రాసం బూడిదగా మారింది. రూ.4లక్షల నష్టం వచ్చిందని తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.



దగ్ధమవుతున్న గడ్డివాములు

శివారు కాలనీలే టార్గెట్



- పెరిగిపోతున్న చోరీలు
- నిద్రావస్థలో రాత్రి గస్తీ
- స్టేషన్ల మధ్య లోపించిన సమన్వయం
- పనిచేయని సీసీ కెమెరాలు
- బెంబేలెత్తుతున్న ప్రజలు
- కరువైన ఉన్నతాధికారుల పర్యవేక్షణ

కర్నూలు క్రైం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో దొంగలు పెట్రేగిపోతున్నారు. శివారు కాలనీలే టార్గెట్‌గా రెచ్చిపోతున్నారు. కేవలం సెకండ్ల వ్యవధిలోనే జరిగే దొంగతనాలకు బాధితులు మూగ సాక్ష్యాలుగా మిగులుతున్నారు. రాత్రిళ్లు మానేసి ఏకంగా పట్టపగలే గొలుసు దొంగతనాలకు పాల్పడుతూ పోలీసులకు సవాల్ విసురుతున్నారు. హైదరాబాద్‌లో ప్రతి రోజూ జరిగే దొంగతనాలు కర్నూలుకు పాకాయి. గొలుసు చోరీలను పోలీసులు నియంత్రించలేకపోతున్నారు. చాకచక్యంగా వ్యవహరించలేకపోవడంతో సామాన్యులకు ఆవేదనే మిగులుతుంది. పట్టపగలు దొంగలు చెలరేగిపోతున్నా పోలీసులు సినిమా చూసినట్లు చూస్తున్నారు. ఇళ్లలోకి చొరబడి తుపాకులతో బెదిరించినా.. మాకేమి అన్నట్లు పోలీసులు వ్యవహరిస్తున్న తీరు ప్రజల్లో ఆందోళనలు కలిగిస్తోంది.

- ఏప్రిల్ 4వ తేదీన త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ధనలక్ష్మినగర్‌లో నివాసం ఉంటున్న ఉపాధ్యాయుడు చంద్రశేఖర్‌రెడ్డి ఇంట్లో భారీ చోరీ జరిగింది. ఆయన ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు సుమారు రూ.12లక్షల విలువైన సొత్తును అపహరించారు. (ఏడున్నర తులాల బంగారు, 5.5 లక్షల నగదు, కొంత వెండి నగదు అపహరించారు.)
- ఏప్రిల్ 12న త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పార్థసారధినగర్‌లో నివాసం ఉంటున్న రాంగోపాల్ కుటుంబ సభ్యులతో కలిసి ఊరెళ్లాడు. అతడి ఇంట్లో ఆరున్నర తులాల బంగారు నగలు, 50 తులాల వెండి నగలు చోరీచేశారు. 14వ తేదీ ఇంటికి వచ్చి చూస్తే ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయి. ఇంట్లో ఉన్న నగలు చోరీకి గురైనట్లు గుర్తించారు.

క్షణాల్లో తాళాలు పగలగొట్టి..

ఇతర రాష్ట్రాలకు చెందిన దొంగల ముఠాలు క్షణాల్లో తాళాలు పగులగొట్టి చోరీలకు పాల్పడుతున్నారు. ఇటీవల నగరంలో ఓఇంట్లో మనుషులు లోపల ఉన్నా కూడా ఇంట్లోకి చొరబడి నిద్రమత్తులో ఉండగానే చోరీ చేశారంటే వారు దొంగతనం ఎంత చాకచక్యంగా చేశారో అర్థం చేసుకోవచ్చు. ఒకేరోజు గంటల వ్యవధిలో స్నాచింగ్‌లకు, దొంగతనాలకు పాల్పడటం వారి శైలి. ఈముఠాలన్నీ బైక్‌ల నెంబర్ ప్లేట్లు మార్చి బయలు దేరుతారు.

రాత్రి విజన్ స్పష్టంగా..

నగరంలో సీసీ కెమెరాల పనితీరు కూడా అంతంత మాత్రమే. ఇవి కూడా నగరానికే పరిమితమయ్యాయి. గొలుసు దొంగతనాలు ఎక్కువగా శివారు కాలనీలో జరుగుతున్నాయి. ఈ సీసీ కెమెరాల్లో రాత్రి విజన్ స్పష్టంగా కనబడవు. పలు చోట్ల సీసీ కెమెరాలు పనిచేయడం మానేశాయి. ఏదైనా నేరాలు జరిగితే తప్ప సీసీ కెమెరాలు గుర్తుకు రాని పరిస్థితి.

గస్తీ అంతంత మాత్రమే

నగర పరిధిలో ఐదు పోలీసుస్టేషన్లు ఉన్నా జనాభాకు సరిపడా పోలీసులు, తగినన్ని గస్తీ వాహనాలు లేవు. ఏదో నామమాత్రంగా గస్తీ నిర్వహిస్తున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కూడా అంతంత మాత్రమేనన్న ఆరోపణలున్నాయి. కొత్త సిబ్బందికి తగిన అవగాహన లేకపోవడం. సీసీఎస్ ఆశించినస్థాయిలో పని చేయకపోవడం. పాత నేరస్థులపై కదలికలు పసిగట్టకపోవడం. నగరంలో ఆటో నేరగాళ్లపై నిఘా కొరవడింది.

ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటిస్తే..



దొంగతనాలను నియంత్రించేందుకు ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటిస్తే మంచిది. దొంగతనాలు జరిగాక పోలీసుల చుట్టూ తిరిగే కంటే మన సొమ్మును మనమే జాగ్రత్తగా కాపాడుకుంటే సొమ్ము పదిలం. మెయిన్ డోర్‌కు, ఇంటికి ఉన్న అన్ని బయటిడోర్లకు నాణ్యతా దృఢంగా ఉండే సెంటర్ లాకింగ్ సిస్టమ్‌ను ఏర్పాటుచేసుకోవాలి. సీసీ కెమెరాలు, సెక్యూరిటీ అలారం సిస్టమ్స్ ఏర్పాటు చేసుకోవాలి. ఇంటికి తాళం వేసి బయటకు గాని, వేరే ఊర్లకు గాని వెళ్లేటప్పుడు, విలువైన బంగారం, వెండి ఆభరణాలు, డబ్బును ఇంట్లో ఉంచరాదు. ఒకవేళ ఇంట్లో దొంగతనం జరిగినపుడు ఏ వస్తువు కూడా తాకరాదు. బీరువాలను ముట్టరాదు. పోలీసులు వచ్చి వేలిముద్రలు తీసుకున్న తర్వాత ఏదైనా వస్తువులను తాకాలి. ఒకవేళ తాకిన వారు పోలీసులకు వారి వేలి ముద్రలు ఇవ్వాలి

సమన్వయం లేక..

ఒక స్టేషన్ పరిధిలో దొంగతనం జరిగితే మరో స్టేషన్‌వారికి అప్రమత్తం చేసే సమన్వయం ఇక్కడి పోలీసులకు లేదు. ప్రధాన రహదారులపై మాత్రమే తనిఖీలు ఉంటున్నాయి. క్యూఆర్‌టీ, రక్షక్ బైక్‌లు శివారు కాలనీ, వీధుల్లో తిరిగితే కొంత తగ్గే అవకాశం ఉంది. వాహనాల తనిఖీ కూడా తూతూ మంత్రంగానే సాగుతుంది.

పెద్దపులుల సంఖ్య 95

- నాగార్జునసాగర్, శ్రీశైలం టైగర్ రిజర్వులో పెరుగుదల
- ఎఫ్‌డీపీటీ బీవీఏ క్రిష్ణమూర్తి



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎఫ్‌డీపీటీ బీవీఏ కృష్ణమూర్తి

రుద్రవరం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్, శ్రీశైలం టైగర్ రిజర్వులో పెద్దపులుల సంఖ్య 95కు చేరిందని ఎఫ్‌డీపీటీ బీవీఏ కృష్ణమూర్తి అన్నారు. మంగళవారం రుద్రవరం ఫారెస్టు సబ్ డివిజన్ కార్యాలయ ఆవరణలో మొక్కలు పెంచేందుకు నర్సరీ కోసం స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్‌ఎస్‌డీఆర్‌లో పెద్దపులుల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. ఎన్‌ఎస్‌డీఆర్ నంద్యాల, ఆత్మకూరు, మార్కాపురం, గిద్దలూరు, గుంటూరు జిల్లా పల్నాడు జిల్లాలో విస్తరించి ఉందన్నారు. పెద్దపులుల సంరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామన్నారు.

రెండు జిల్లాల్లో రూ.4.52 లక్షల మొక్కలు

నంద్యాల, ప్రకాశం జిల్లాల్లో రూ.4.52 లక్షల మొక్కలను పెంచాలనే లక్ష్యం ఉందని ఆయన అన్నారు. గిద్దలూరులో 1.50 లక్షలు, మార్కా పురంలో 1.50 లక్షలు, ఆత్మకూరులో 50వేలు, నంద్యాల జిల్లా రుద్రవరంలో 1.02 లక్షల మొక్కల పెంపకం లక్ష్యంగా ఉందన్నారు. మొక్కలు పెంచి అందుబాటులో ఉంచాలని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నాయన్నారు. మొక్కల పెంపకంలో నిర్లక్ష్యంగా చేయవద్దని ఫారెస్టు అధికారులకు సూచించారు. మొక్కల పెంపకంలో వర్మీకంపోస్టు ఎరువు తప్పకుండా వాడాలన్నారు. ఆయన వెంట డిప్యూటీ డైరెక్టర్ అనురాగ్ మీనా, సబ్ డీఎఫ్‌వో శ్రీనివాసరెడ్డి, రేంజర్ శ్రీపతినాయుడు, డిప్యూటీ రేంజర్ ముర్తుజావలి, సెక్షన్ ఆఫీసరు రామక్రిష్ణ, మహబూబ్‌ఖాన్, బీట్ ఆఫీసరు సురేంద్రగౌడ్ పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలపై
నిరంతర పోరాటం



మాట్లాడుతున్న ఎన్‌ఎంయూ రాష్ట్ర అధ్యక్షుడు పీవీ రమణారెడ్డి

కర్నూల రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగ, కార్మికుల పరిష్కారం కోసం నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నిరంతరం అలుపెరగని పోరాటం చేస్తోందని ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పీవీ రమణారెడ్డిఅన్నారు. కర్నూలు నగర శివారులోని కమ్మ సంఘం భవన్‌లో మంగళవారం ఆర్టీసీ ఎన్‌ఎంయూ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. రమణారెడ్డి మాట్లాడుతూ సుదీర్ఘ పోరాట ఫలితంగానే కార్మికులకు సంబంధించిన అనేక సమస్యలను సాధించామన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్య వైఖరి వల్ల సమస్యలు పెరిగిపోతున్నాయని ఆరోపించారు. ఉద్యోగుల రిక్రూట్‌మెంట్ చేసి పనిభారం తగ్గించాలని, పెండింగ్‌లో ఉన్న పదోన్నతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశ అనంతరం ఆర్టీసీ ఎన్‌ఎంయూలో సుదీర్ఘ కాలంగా జిల్లా కార్యదర్శిగా పనిచేసి జిల్లాల్లో ఉద్యోగుల ఆదరాభిమానాలు పొంది పదవీ విరమణ పొందిన సి. మద్దిలేటిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జోనల్ కార్యదర్శి చెన్నారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు పూర్ణచంద్రరావు, పీవీ శివారెడ్డి, హరిమోహన్, భాస్కర్‌నాయుడు, సంయుక్త కార్యదర్శి పీఎస్‌ఎన్ రావు, రాష్ట్ర కార్యదర్శులు భద్రావతి, షఫీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

మరో ఇద్దరికి కరోనా..

- ఓ డాక్టర్, 25 ఏళ్ల మహిళకు నిర్ధారణ

కర్నూలు హాస్పిటల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కరోనా మళ్లీ మొదలైంది. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో గత 24 గంటల వ్యవధిలో మరో ఇద్దరికి కొవిడ్ పాజిటివ్ నిర్ధారణ అయింది. కర్నూలు జీజీహెచ్‌కు చెందిన ఓ ప్రొఫెసర్‌కు పరీక్షలు నిర్వహించగా.. కొవిడ్ నిర్ధారణ అయింది. నగరంలోని వెంకటరమణకాలనీకి చెందిన ఈ డాక్టర్ హోం ఐసోలేషన్‌లో చికిత్స పొందుతున్నారు. మంత్రాలయం మండలం పరమాన్‌దొడ్డి తండాకు చెందిన 25 ఏళ్ల మహిళ అనారోగ్యంతో వారం రోజుల క్రితం కర్నూలు జీజీహెచ్‌లో చేరింది. శనివారం మహిళకు కరోనా పరీక్షలు చేయగా.. మంగళవారం మధ్యాహ్నం పాజిటివ్‌గా తేలింది. దీంతో మహిళను వీఐసీ నెగిటివ్ ప్రెజర్ రూంకు తరలించి చికిత్స అందిస్తున్నారు.



కొవిడ్ రోగి తిప్పలు

సోమవారం కరోనా నిర్ధారణ అయిన ఎమ్మిగనూరు మండలం కలుగోట్ల రోగిని పాతగైనిక్ విభాగంలోని కొవిడ్ వార్డుకు తరలించారు. మంగళవారం మధ్యాహ్నం మళ్లీ ఆ రోగిని వీఐపీ నెగిటివ్ ప్రెజర్ రూంకు తరలించారు. పాత గైనిక్ విభాగంలోని కొవిడ్ వార్డుకు బాత్‌రూంలు లేకపోవడంతో రోగికి తరలించినట్లు సిబ్బంది చెబుతున్నారు. పాత గైనిక్ విభాగంలో కొవిడ్ వార్డు ఆవరణలో ఫిమేల్ మెడికల్ వార్డులు ఉన్నాయి. అక్కడ మహిళా రోగులు ఉన్నచోట కొవిడ్ వార్డును ఎలా ఏర్పాటు చేస్తారని బంధువులు మండిపడుతున్నారు. రెండు రోజులుగా కొవిడ్ రోగిని అటు ఇటు తిప్పుతుండటంపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. కొవిడ్ వార్డును ఏర్పాటు చేసిన శిథిలమైన గైనిక్ వార్డుల ప్రత్యేకమైన బాత్‌రూమ్‌లు లేకపోవడంతో పక్కన ఉన్న ఫిమేల్ వార్డుల బాత్‌రూంనే వాడుకోవాల్సి వస్తున్నది. అధికారులు స్పందించి కరోనా కేసులు పెరుగుతున్న దృష్ట్యా ప్రత్యేక కొవిడ్ వార్డును అన్ని సౌకర్యాలతో ఏర్పాటు చేయాలని రోగులు కోరుతున్నారు.



పాతగైనిక్ విభాగంలో మూతపడ్డ కొవిడ్ వార్డు

భయం వద్దు



కరోనా కొత్త వేరియంట్ పట్ల ప్రజలు భయాందోళనలకు గురి కానవసరం లేదు. జలుబు, దగ్గు, జ్వరం ఉన్న రోగులు సెల్ఫ్ ఐసోలేషన్‌లో ఉండాలి. ఆయాసం ఉండి జ్వరం, దగ్గు, జలుబు ఉంటే వైద్యులను సంప్రదించాలి. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారు చిన్న పిల్లలు, వృద్ధులు, గుండె, కిడ్నీ, క్యాన్సర్, లివర్ వంటి దీర్ఘకాలిక జబ్బులు ఉన్నవారు మాస్కులు ధరించి జాగ్రత్తలు తీసుకోవాలి. కొవిడ్ నియంత్రణకోసం కర్నూలు జీజీహెచ్‌లో పల్మనాలజి హెచ్‌వోడీ డా.శ్రీకాంత్‌ను నోడల్ ఆఫీసర్‌గా నియమించాం. పాత గైనిక్ విభాగంలో పది పడకలతో కొవిడ్ వార్డుతోపాటు అవసరమైతే టీబీ వార్డు పక్కన 20పడకలతో ప్రత్యేక కొవిడ్ వార్డును ఏర్పాటు చేయనున్నాం.

- డాక్టర్ శ్రీరాములు, ఇన్‌చార్జి సూపరింటెండెంట్, జీజీహెచ్

నది ఒడ్డున శ్మశానానికి రోడ్డు



చెట్నహళ్లిలో రస్తాను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్



మృతదేహాన్ని తరలించేందుకు గ్రామస్థుల అవస్థలు(ఫైల్)

- సమస్య పరిష్కారం దిశగా చర్యలు
- రూ.45 లక్షలు మంజూరు

మంత్రాలయం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెట్నహళ్లిలో శ్మశానానికి రోడ్డు సమస్య పరిష్కారం కానుంది. ఇందులో భాగంగా కలెక్టర్ రంజిత్‌బాషా, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్, తహసీల్దార్ ఎస్.రవి సమస్యను పరిష్కరించేందుకు నది ఒడ్డున శ్మశానానికి రోడ్డు వేసేందుకు చర్యలు చేపట్టారు. సర్వే.నెంబర్.126లోని 3.54ఎకరాల శ్మశానం రికార్డులో ఉంది. శ్మశాన స్థలానికి, గ్రామానికి 1.5 కిలోమీ టర్ల దూరం ఐదు మీటర్ల వెడల్పుతో రోడ్డు మంజూరుకు నిధులు కేటాయించారు. చెట్నహళ్లి గ్రామంలో రూ.45 లక్షలతో రోడ్డు మం జూరు చేశారు. శ్మశాన రోడ్డును పంచాయతీరాజ్ డీఈ రంగ స్వామి, ఏఈ మల్లయ్య, ఇంజ నీరింగ్ అసిస్టెంట్ రంగమ్మ పర్యవేక్షిస్తున్నారు. ఈ రోడ్డు పూర్తయితే.. నది ఒడ్డున ఉన్న శ్మశాన స్థలానికి అనువుగా ఉండేందుకు రోడ్డు నిర్మాణ పనులు పూర్తయి ఎతే.. ఇరువర్గాలకు మేలని అధికారులు అంచనా వేస్తున్నారు.

నాలుగు నెలల నుంచి..

సర్వేనెంబర్ 113లోని 1.42ఎకరాల్లో రస్తాలో కొన్నేళ్లుగా శ్మశానాన్ని అన్నికులాల వారు ఉపయోగించి అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఆశ్మశానం పక్కనే దళితులకు ఇళ్ల స్థలాలు కేటాయించగా వారు అక్కడ ఇళ్లు నిర్మించుకున్నారు. దీంతో శ్మశానంలోని మృతదేహాల పుర్రెలు, కళేబరాలు దళితుల గృహాల ముందు కుక్కలు, పందులు పడేస్తుండటంతో దళితులు అధికారులను ఆశ్రయించి శ్మశానాన్ని మార్చాలని ఆందోళనలు చేపట్టారు. దీనికి బీసీ వర్గాలు అడ్డు చెప్పడంతో నాలుగు నెలల నుంచి బీసీ, ఎస్సీ వర్గాల మధ్య వివాదం కొనసాగుతూనే ఉంది. దీంతో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డీఎస్పీ ఉపేంద్రబాబు, తహసీల్దార్ ఎస్.రవి, మండల సర్వేయర్ అశోక్ ఆధ్వర్యంలో ప్రభుత్వం నిర్ణయించిన శ్మశానం స్థలాన్ని పరిశీలించి కబ్జాకు గురైన రహదారి, శ్మశాన స్థలాన్ని ఖాళీ చేయించే దిశగా అడుగులు వేస్తున్నారు. దాదాపు 1.5 కిలోమీటర్ల దూరం, 5 మీటర్ల వెడల్పుతో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో పనులు చేపట్టేందుకు శ్రీకారం చుడుతున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య సమస్య పరిష్కారం కానుంది.

బస్సు షెల్టర్లు ఏవీ?

- ఉన్నవి కూడా తొలగించారు
- ఎండకు, వానకు ప్రయాణికుల ఇబ్బందులు
- పట్టించుకోని సంబంధిత అధికారులు

కర్నూలు న్యూసిటీ, జూన్ 3(ఆంధ్రజ్యోతి): నగరంలో కొన్ని సంవత్సరాల క్రితం నిర్మించిన బస్ షెల్టర్లను అధికారులు తొలగించారు. ప్రధాన కూడళ్లలో తొలగించడంతో ప్రయాణికులు ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ ఇబ్బంది పడుతున్నారు. బస్‌షెల్టర్లను ఆధునికీకరిస్తామన్న అధికారులు తరువాత పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నారు. మూడేళ్లుగా నగరంలో బస్‌షెల్టర్లు లేకపోవడంతో ప్రజల పాట్లు వర్ణనాతీతం.

పలు కారణాలతో..

రాజ్‌విహార్, సి.క్యాంపు, మెడికల్ కాలేజీ, బిర్లాగేట్, బళ్లారిచౌరస్తా, దామోదరం సంజీవయ్య కూడలి, కలెక్టరేట్ కూడళ్లలో గతంలో బస్‌షెల్టర్లు ఉండేవి, ఇక్కడ అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని, ఎవ్వరు ఉండటంలేదని, ట్రాఫిక్ అంతరాయం కలుగుతోందనే పలు కారణాలతో అప్పటి నగరపాలక అధికారులు షెల్టర్లను తొలగించారు. ఈ తరువాత నగరంలో 52 బస్‌షెల్టర్ల ఆధునికీకరణ చేపడతామన్న అధికారులు మాటలు కాగితాలకే పరిమితమయ్యాయి. నగరంలో 52 వార్డులు ఉండగా సుమారు 7 లక్షల జనాభా ఉంది. నగరానికి వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు ఎక్కువ సంఖ్యలో నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ప్రధానంగా కలెక్టరేట్, సీ. క్యాంపు, బిర్లాగేటు, బళ్లారి చౌరస్తా, దామోదరం సంజీవయ్య కూడలిలో ఎక్కువ సంఖ్యలో ప్రయాణికులు ఉంటారు.



కలెక్టరేట్ వద్ద..



పెద్దాసుపత్రి వద్ద..



సి. క్యాంప్ సెంటర్‌లో బస్‌షెల్టర్‌లో లేక రోడ్డుపై నిలబడిన ప్రయాణికులు

అవగాహన కల్పించినా..

బస్‌షెల్టర్లు తొలగించి వాటి స్థానంలో ఎవరైనా ముందుకు వచ్చి అక్కడ తమ సొంత డబ్బుతో బస్‌షెల్టరు ఏర్పాటు చేసుకోవచ్చని అధికారులు చెబుతున్నారు. వాటికి ప్రకటనలు అంటించుకుని ఆదాయాన్ని పొందవచ్చని అవగాహన కూడా కల్పించారు. కొన్ని సంవత్సరాల కాల పరిమితి వరకు నగర పాలకకు ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని సూచిస్తున్నారు. బస్‌షెల్టరు ఏర్పాటుకు సుమారు రూ.2లక్షలకు పైగా ఖర్చు అవుతుంది. పైగా ప్రకటనల నుంచి పెద్దగా ఆదాయం రాదనే భావనతో నిర్మాణానికి ఎవరూ ముందుకు రావడంలేదు.

బంకులు, దుకాణాలు వెలిశాయి

బస్‌షెల్టర్లు తొలగించిన స్థానంలో పలుచోట్ల బంకులు, దుకాణాలు వెలిశాయి. కొందరు వాటిని బాడుగలకు ఇచ్చుకుని సొమ్ము చేసుకుంటున్నారు. అధికారులు, పాలకులు ప్రజల అవసరాలపై దృష్టిసారించాల్సిన అవసరం ఉందని నగరవాసులు కోరుతున్నారు.

ఒకేషనల్ జూనియర్ కళాశాల తనిఖీ



అధ్యాపకులతో మాట్లాడుతున్న డీవీఈవో సురేష్‌బాబు

కర్నూలు ఎడ్యుకేషన్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): స్థానిక బి.క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలను మంగళవారం జిల్లా వృత్తి విద్యాధికారి సురేష్‌బాబు తనిఖీ చేశారు. 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి కళాశాలలో అడ్మిషన్ల సంఖ్య పెంచాలని, సమయ పాలన పాటిస్తూ వార్షిక ప్రణాళిక ప్రకారం విద్యాబోధన చేయాలని అధ్యాపకులకు సూచించారు. విద్యార్థులతో యోగాసనాలు, మెడిటేషన్ చేయిస్తూ సృజనాత్మకతను పెంచడానికి కృషి చేయాలన్నారు. కళాశాలలో ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యాదీవెన పథకంలో భాగంగా ప్రభుత్వం ఉచితంగా సప్లయ్ చేస్తున్న పాఠ్యపుస్తకాలను డీవీ ఈవో పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. నాగస్వామి నాయక్, అధ్యాపకులు ప్రసన్న కుమార్, రామకృష్ణ, విజయశేఖర్, మల్లికార్జున పాల్గొన్నారు.

వైభవంగా సుంకులమ్మ దేవర



దేవరలో పాల్గొన్న గౌరు వెంకటరెడ్డి, టీడీపీ నాయకులు

ఓర్వకల్లు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని శకునాల గ్రామంలో మంగళవారం సుంకులమ్మ దేవర వైభవంగా నిర్వహిం చారు. మహిళలు ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి బోనాలు సమర్పిం చారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ వేడుకల్లో నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి, నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కర్నూలు రూరల్ సీఐ చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ఓర్వకల్లు ఎస్ఐ సునీల్‌కుమార్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో నాయకులు చదువుల సుధాకర్‌రెడ్డి, గోవిందరెడ్డి, మోహన్ రెడ్డి, చంద్రపెద్దస్వామి, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, రాంభూపాల్ రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, మీదివేముల ప్రభాకర్ రెడ్డి, తిప్పన్న, రంగనాథగౌడు పాల్గొన్నారు.

నగర సుందరీకరణకు సహకరించాలి: కమిషనర్

కర్నూలు న్యూసిటీ, జూన్ 3(ఆంధ్రజ్యోతి): నగర సుందరీకరణకు ప్రజలంతా సహకరించాలని కమిషనర్ ఎస్.రవీంద్రబాబు మంగళ వారం ఒక ప్రకటనలో కోరారు. ప్రధాన కూడళ్లు, డివైడర్లు, మధ్యలోని స్తంభాలు, గోడలపై బ్యానర్లు, పోస్టర్లు అతికిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. దీనిని ఎవరైనా అతిక్రమించి నగర సుందరీకరణకు ఆటంకం కలిగిస్తే వారిపై మున్సిపల్ కౌన్సిల్ సీఆర్. నెం.78 ప్రకారం జరిమానా విధించడంతోపాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటా మని హెచ్చరించారు.

వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలి

కర్నూలు న్యూసిటీ, జూన్ 3(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దుచేయాలని ముస్లిం పర్సనల్‌లా బోర్డు రాష్ట్ర కమిటీ సభ్యురాలు జలీసా సుల్తానా బీజేపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం వక్ఫ్ చట్ట సవరణ చేయాలని కోరుతూ ముస్లిం పర్సనల్ లా బోర్డు, సేవ్ వక్ఫ్, సేవ్ కాన్స్టిట్యూషన్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో మహిళలు సభా మెరిడియన్ ఫంక్షన్ హాల్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. సుల్తానా మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం పార్లమెంటులో తమకు ఎంపీల సంఖ్య బలం ఉందని ఇష్టానుసారంగా చట్టాలను చేస్తూ ప్రజలకు వ్యతిరేకంగా పరిపాలన చేస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర ఉపా ధ్యక్షురాలు పి.నిర్మల, డా.కుద్దుసా, జమాతే ఇస్లామియా ఏ హింద్ జి ల్లా సభ్యులు అలివేలమ్మ, అరుణ, జయమ్మ, పుష్పావతి పాల్గొన్నారు.

దాడి అమానుషం

కర్నూలు అర్బన్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): కోసిగిలో టీడీపీ కార్యకర్తలపై వైసీపీ వర్గీయులు చేసిన దాడిని ఎంపీ బస్తిపాటి నాగరాజు ఖండించారు. మంగళవారం ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన ఫోన్ ద్వారా ఘటనపై పోలీసు అధికారులతో మాట్లాడారు. దాడికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. టీడీపీ నాయకుడి కుమారుడి పెళ్లి ఊరేగింపులో టీడీపీకి సంబంధించిన పాటలు పెట్టారని వైసీపీ వర్గీయులు దాడికి పాల్పడటం సిగ్గుచేటని మండిపడ్డారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

కర్నూలు రూరల్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): కర్నూలు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రఘునాథ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ అధ్యక్షతన జరిగే ఈసమావేశానికి కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు హాజరవుతారన్నారు. ఈసమావేశానికి జట్పీటీసీ సభ్యుడు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

ఎమ్మెల్యేను కలిసిన అధ్యాపకులు



గౌరు దంపతులతో అధ్యాపకులు, జిల్లా కో-ఆర్డినేటర్

కర్నూలు ఎడ్యుకేషన్/ కల్లూరు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): స్థానిక మాధవీ నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, టీడీపీ సీనియర్ నాయకుడు గౌరు వెంకటరెడ్డిని చిన్నటేకూరు ఐఐటీ మెడికల్ అకాడమీ జిల్లా కో-ఆర్డి నేటర్ ఐ.శ్రీదేవి, డైరెక్టర్ ఉమామహేశ్వరప్ప, అధ్యాపకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కోఆర్డినేటర్ శ్రీదేవి మాట్లాడుతూ చిన్నటేకూరు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఐఐటీ మెడికల్ అకాడమీ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే గౌరు చరిత నిధులు కేటాయించాలని కోరగా.. ఆమె స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.10లక్షలు మంజూరు చేయించడం హర్షణీయమన్నారు. ఈసందర్భంగా వారు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో డైరెక్టర్ బి.ఉమామహేశ్వరప్ప, అధ్యాపకులు జి.చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మవారికి వెండి కిరీటం



ఆలయ సిబ్బందికి వెండి కిరీటం అందజేస్తున్న భక్తుడు

గూడూరు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): గూడూరు మండలం కె. నాగులాపురం సుంకులా పరమేశ్వరి అమ్మవారికి కృష్ణగిరి మండలం సంగాల గ్రామానికి చెందిన భక్తుడు నెల్లూరు సుంకన్న 238 గ్రాముల వెండి కిరీటాన్ని కానుకగా సమర్పించినట్లు ఆలయ సిబ్బంది కేశవ తెలిపారు. మంగళవారం అమ్మవారిని దర్శించుకున్న అనంతరం ఆలయ సిబ్బందికి వెండి కిరీటాన్ని కానుకగా సమర్పించారు. ఈ సందర్భంగా భక్తునికి అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు.

రైతుభరోసా రథాన్ని తిప్పాలి



జేడీకి వినతి పత్రం ఇస్తున్న రైతుసంఘం నాయకులు

కర్నూలు అగ్రికల్చర్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించేందుకు రైతుభరోసా రథాన్ని ప్రభుత్వం అమల్లోకి తెచ్చిందని, ఈ రథాన్ని తిప్పాలని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం, జిల్లా సహాయ కార్యదర్శి దంబోళం శ్రీనివాసరావు వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అనుమతులు ఇవ్వాలని మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మిని కోరారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఈ బస్సు(రథం) ఉమ్మడి జిల్లాకు వచ్చి సుమారు ఏడాది కాలం గడిచిపోయిందన్నారు. లక్షలు విలువ చేసే ఈ బస్సును పక్కన పెట్టి వ్యవసాయ శాఖ నిర్లక్ష్యం చూపడం దారుణమన్నారు.

నదుల్లో కలుస్తున్న మురుగును ఆపాలి

పీపీఎస్ఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు పుల్లారెడ్డి



మురుగు నీటి శుద్ధి కేంద్రాన్ని పరిశీలిస్తున్న పీపీఎస్ఎస్ సభ్యులు

కర్నూలు న్యూసిటీ, జూన్ 3(ఆంధ్రజ్యోతి): నగర పాలక పరిధిలోని నదుల్లో కలుస్తున్న మురుగును ఆపాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఇరిగినేని పుల్లారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం సంఘం ప్రతినిధి బృందం సభ్యులతో కలిసి హంద్రీ, తుంగ భద్ర నదుల ఒడ్డున నిలిచిపోయిన మురుగు నీటి శుద్ధి కేంద్రాలను పరిశీలించారు. పుల్లారెడ్డి మాట్లాడుతూ జమ్మిచెట్టు సమీపంలో 2020లో హంద్రీ నది ఒడ్డున రూ.48 కోట్లతో, సుంకేసుల రోడ్డులో తుంగభద్ర నది ఒడ్డున గతేడాది రూ.75 కోట్లతో మురుగునీటి శుద్ధి కేంద్రాల నిర్మాణం కోసం పనులు ప్రారంభించారన్నారు. ఈ రెండు కేంద్రాల నిర్మాణ పనులు పూర్తిగా నిలిచిపోయాయన్నారు. దీంతో నదుల్లో మురుగు నీరు నిలిచి కాలుష్యం పెరిగి దుర్వాసన, దోమలతో ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారని అన్నారు. కార్యక్రమంలో సభ్యులు వెంకటవర్మ, ఆంజనేయులు గౌడు, ఎస్.అహ్మద్, నాగరాజు, యూనుస్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఏడాదిలో సుపరిపాలన

కర్నూలు అర్బన్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ఏడాదిలో కూటమి ప్రభుత్వం సుపరిపాలన అందించిందని నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ వీటి విజయకుమార్ అన్నారు. మంగళవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బుధవారానికి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి అవుతుందన్నారు. మంత్రి లోకేశ్ ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు మహానాడును విజయవంత చేశారన్నారు. ఏడాది పూర్తయిన సందర్భంగా టీడీపీ ఆఫీసులను రం గవళ్లలతో అలంకరించి, సాయంత్రం దీపాలను వెలిగించాలని కోరారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి: ఎస్ఐ

సి.బెళగల్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ పరమేష్‌నాయక్ సూచించారు. మంగళవారం మండలంలోని కంబంధహాల్‌లో గ్రామస్థులతో ఆయన సమావేశమయ్యారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్ఐ వెంట సర్పంచ్ చిన్న ఈరమ్మ, ఎంపీటీసీ శోభారెడ్డి ఉన్నారు.

ప్రజల దృష్టి మరల్చేందుకే డ్రామాలు

- గొడ్డలిపోటు దినం జరుపుకోండి
- జగన్ ముఠా చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి
- వైసీపీని ప్రజలు నమ్మే స్థితిలో లేరు
- పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరిత

కల్లూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కుంభకోణాల నుంచి రాష్ట్ర ప్రజల దృష్టి మరల్చడానికే వైసీపీ వెన్నుపోటు ధర్నా డ్రామాలు ఆడుతుందని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత విమర్శించారు. మంగళవారం మాధవీనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా గౌరుచరిత మాట్లాడుతూ అసలైన వెన్నుపోటు దారుడు జగన్‌రెడ్డి.. వెన్నుపోటు అంటూ ధర్నాలు చేయడం దొంగేదొంగ అన్నట్లు ఉందని గొడ్డలి పోటు దినం కూడా జరుపుకోవాలని హితవు పలికారు. కూటమి ప్రభుత్వంపై జగన్ ముఠా చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని, సీఎం చంద్రబాబు చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పాలనను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో తండ్రిని అడ్డం పెట్టుకుని లక్షల కోట్లు దోచుకుని ఆదే పార్టీకి వెన్నుపోటు పొడిచి వైసీపీని స్థాపించారని విమర్శించారు. రాష్ట్రంలో కూటమి పాలనలో తొలి ఏడాదిలోనే 70శాతం హామీలను అమలు చేశామని, ఎన్టీఆర్ భరోసా పింఛన్ రూ.4వేలకు పెంచామని, 16,347 పోస్టులతో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి మొదటి సంతకం మాట నిలబెట్టుకున్నామన్నారు. వైసీపీ దుష్ప్రచారాలను నమ్మేందుకు ప్రజలు సిద్ధంగా లేరని అన్నారు. కార్యక్రమంలో పెరుగు పురుషోత్తం రెడ్డి, ఆర్.చంద్రకళాధర్‌రెడ్డి, ప్రభాకర్ యాదవ్, పీయూ మాదన్న పాల్గొన్నారు.

క్రీడాకారులకు బ్యాగుల పంపిణీ



బ్యాగులు పంపిణీ చేస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ

కర్నూలు స్పోర్ట్స్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): పాతబస్టాండు మున్సిపల్ పార్కులో తైక్వాండో శిక్షకుడు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శిబిరంలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్‌శర్మ మంగళవారం బ్యాగులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా శంకర్‌శర్మ మాట్లాడుతూ అతిగా స్మార్ట్ ఫోన్‌ను వినియోగం వల్ల కలిగే దుష్ఫలితాల నుంచి పిల్లలను దూరం చేయాలంటే క్రీడలు అవసరమన్నారు. పిల్లలు క్రీడల్లో పాల్గొనేలా తల్లిదండ్రులు ప్రోత్సాహించాలన్నారు. ఈ కార్యక్రమంలో తైక్వాండో చిన్నారులు, కోచ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలి



చౌక దుకాణాన్ని తనిఖీ చేస్తున్న తహసీల్దార్

గూడూరు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): చౌకదుకాణాల్లో కార్డుదారులకు రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ రామాంజనేయులు అన్నారు. మంగళవారం గూడూరు మండలంలోని గుడిపాడు, కె.నాగులాపురం పెంచికలపాడు, బూడిదపాడు గ్రామాల్లోని రేషన్ షాపులను తహసీల్దార్ తనిఖీ చేశారు. ఆయన వెంట రెవెన్యూ అధికారులు, ఆర్ఐ, వీఆర్వోలు ఉన్నారు.

సి.బెళగల్: మండలంలోని సి.బెళగల్, కంబంధహాల్, ఇనగండ్ల, గుండ్రేవుల, కొండాపురం, ఈర్లదిన్నె, శింగవరం, కొత్తకోట తదితర గ్రామాల్లోని చౌకదుకాణా లను తహసీల్దార్ పురుషోత్తం మంగళ వారం తనిఖీ చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ రేషన్ కార్డుదారులకు సక్రమంగా బియ్యం పంపిణీ చేయాలని డీలర్లకు ఆదేశించారు. తహసీల్దార్ వెంట ఆర్ఐ తరుణ్, వీఆర్వోలు ఉన్నారు.

కూలీలకు వేతనాలు చెల్లించాలి

కర్నూలు అగ్రికల్చర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ కూలీలకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లో డ్వామా పీడీ వెంకటరమణకు కూలీలకు వేతనబకాయిలు వెంటనే చెల్లించాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వమే కూలీలతో పని చేయించుకుని పస్తులు పెట్టడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. కేవలం ఒక్క కర్నూలు జిల్లాలోనే రూ.100 బకాయిలు ఉంటే.. రాష్ట్రంలోని అన్ని జిల్లాలు కలిపి ఇంకెన్ని వందల కోట్లు పెండింగ్‌లో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు లింగన్న తదితరులు ఉన్నారు.

గృహ నిర్మాణాల పరిశీలన

సి.బెళగల్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కంబంధహాల్, సి.బెళగల్ గ్రామాల్లోని గృహ నిర్మాణాలను ఎంపీడీవో రాణెమ్మ మంగళ వారం పరిశీలించారు. రాణెమ్మ మాట్లాడుతూ మండలానికి ఇప్పటి వరకు మంజూరైన గృహాల్లో దాదాపు పూర్తయ్యాయన్నారు. ఎంపీడీవో వెంట ఏఈ సుమంత్, వర్క్ ఇన్స్‌పెక్టర్ రంగన్న, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఉన్నారు.

సాంకేతిక సాగు పద్ధతులు పాటించాలి



మాట్లాడుతున్న ఏడీఏ సాలురెడ్డి

కోడుమూరు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): సాంకేతిక సాగు పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాఖ ఏడీఏ సాలురెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. సాలురెడ్డి మాట్లాడుతూ సాంకేతిక సాగు పద్ధతుల గురించి ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే రైతులకు అన్ని విషయాలు తెలియజేయాల్సిన బాధ్యత మండల వ్యవసాయ అధికారులపై ఉందన్నారు. భూసార పరీక్షలు నిర్వహించి, రైతులకు అవస రమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలన్నారు. అన్నదాత సుఖీభవ సంబంధించిన రైతుల జాబితాను పకడ్బందీగా తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు మౌనిక, డీఆర్సీ ఏడీఏ అన్నపూర్ణమ్మ, ఉద్యాన అధికారి మదన్మోహన్, మండల వ్యవసాయ అధికారి రవిప్రకాశ్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న వైద్యాధికారి మిథున్‌కుమార్‌రెడ్డి

సి.బెళగల్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి మిథున్‌కుమార్‌రెడ్డి ఏఎన్ఎంలకు సూచించారు. మంగళవారం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని ఏన్ఎంలు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పెచ్చులూడుతున్నాయ్..!

- శిథిలావస్థలో గురుకుల పాఠశాల
- భయాందోళనలో విద్యార్థులు



పెచ్చులాడిపడిన తరగతి గది పైకప్పు

సి.బెళగల్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): స్థానిక అంబేడ్కర్ గురుకుల పాఠశాల తరగతి గదులు స్లాబ్ పెచ్చులూడుతున్నాయి. ఎప్పుడు కూలిపోతుందోనని భయంతో విద్యార్థులు చదువులు కొనసాగిస్తున్నారు. ఈ పాఠశాలలో 600 మంది విద్యార్థులు చదువుతున్నారు. తరగతి గదులు శిథిలావస్థలో ఉన్నాయని జిల్లా ఉన్నతాధికారులకు విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపినా కూడా స్పందించడం లేదు. దీంతో విద్యార్థులు ఒక్కరోజు సెలవు వస్తే ఇంటిదారి పడుతున్నారు. ఎందుకు విద్యార్థులు ఇంటికి పోతున్నారని అడిగితే పాఠశాల తరగతి గదులు శిథిలావస్థలో ఉన్నాయని సమాధానమిస్తున్నారు. ఉన్నతాధికారులు చొరవ తీసుకొని అదనపు గదులను నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

దురవస్థ



తమ కాలనీలో మురుగు కాలువలు, సీసీ రోడ్లు లేకపోవడంతో అవస్థలు పడుతున్నామని పట్టణంలోని భీమిరెడ్డి కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ కాలనీలో 2వేల మంది నివసిస్తున్నామని, అధికారులు కనీస సౌకర్యాలు కల్పించలేదని వాపోతున్నారు. దుర్వాసనతో అన్నం కూడా తినలేకున్నామని వాపోయారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించాలని కోరుతున్నారు. - ఆదోని

అంధకారం



పట్టణంలోని ఆలూరు-బళ్లారి ప్రధాన రహదారిలో వీధిలైట్లు వెలగక అంధకారంగా మారింది. రోడ్డుకు మధ్య డివైడర్లు ఉండడంతో రాత్రిళ్లు దారి కనిపించక వాహనదారులకు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. ఈ విషయంపై డిప్యూటీ ఎంపీడీవో ప్రభాకర్‌రావు మాట్లాడుతూ సాంకేతిక సమస్యతో వీధి దీపాలు వెలగడం లేదని, మరమ్మతులు చేయిస్తామన్నారు. - ఆలూరు

నేడు వేరుశనగ విత్తనాల పంపిణీ

పత్తికొండ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): సబ్సిడీ వేరుశనగ విత్తనాలను బుధవారం పంపిణీ చేస్తున్నట్లు ఏవో వెంకటరాముడు తెలిపారు. పత్తికొండ మండలం వండవెం గ్రామంలో సాయంత్రం 4 గంటలకు జరగనున్న ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే శ్యాంబాబు హాజరవుతారన్నారు.

కార్యదర్శిపై డీపీఎల్‌వో ఆగ్రహం

చిప్పగిరి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దౌల్తాపురం గ్రామ కార్యదర్శి సుధీర్‌పై డీపీఎల్‌వో వీరభద్రప్ప ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉండడం లేదని ఫిర్యాదులు వచ్చాయన్నారు. మంగళవారం గ్రామాల్లో పర్యటించారు. డీపీఎల్‌వో, ఈవోఆర్డీ బాలన్న



ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డీఎల్‌పీవో వీరభద్రప్ప

ఆధ్వర్యంలో పంచాయతీ సెక్రటరీతో సమావేశం నిర్వహించారు.

వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దే రేషన్

ఆలూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): 65 ఏళ్ల పైబడ్డ వృద్ధులు, దివ్యాంగులకు 8వ తేదీ వరకు ఇంటి వద్దే రేషన్ ఇస్తామని తహసీల్దార్ గోవింద్‌సింగ్ తెలిపారు. మండలంలో 948 మంది దివ్యాంగులు, 65 యేళ్లు పైబడిన వారిని గుర్తించామన్నారు.

బక్రీద్‌ను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి



మాట్లాడుతున్న సీఐలు

ఆదోని, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ముస్లింలు బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని వన్‌టౌన్, టూటౌన్, 3టౌన్ సీఐలు శ్రీరామ్, రాజశేఖర్ రెడ్డి, రామలింగయ్య కోరారు. మంగళవారం టూటౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో సీఐ రాజశేఖర్ రెడ్డి అధ్యక్షతన పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. కుల మతాలకు అతీతంగా పండుగలను చేసుకోవాలని ఒకరి మతాన్ని ఒకరు గౌరవించుకుందామన్నారు. ప్రార్థన వేళల్లో ఇబ్బందులు కలుగకుండా చూసుకోవాలన్నారు. పెద్దలు సాదీ రావుఫ్, న్యాయవాది మమతా లోకేష్, బుద్ధారెడ్డి, మరియాని చెన్న బసప్ప పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

వెల్దుర్తి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): పంటల యాజమాన్య పద్ధతులపై శాస్త్రవేత్తలు సుజాత, అశోక్‌కుమార్ రైతులకు అవగాహన కల్పించారు. బుధవారం రామళ్లకోట గ్రామ సచివాలయంలో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం ఏవో అక్బర్‌బాషా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఖరీఫ్‌లో వేరుశనగ, కంది, శనగ, మిరప పంటల్లో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెళకువలు, పత్తి పంటలో రసం పీల్చే గులాబీ పురుగు యొక్క సస్యరక్షణ చర్యల గురించి రైతులకు అవగాహన కల్పించారు. భూసార పరీక్షలు అనుగుణంగా ఎరువులు వాడి దిగుబడులు సాధించాలన్నారు. అనంతరం రాయితీపై పురుగు మందులను పంపిణీ చేశారు. ఏపీపీ మోహన్ విజయ్‌కుమార్, శాస్త్రవేత్త చందన, రైతుసేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పంచాయతీల ఆదాయాన్ని పెంచాలి

ఆదోని రూరల్, జూన్ 3 ఆంధ్రజ్యోతి): సర్పంచులు, సిబ్బంది పంచాయతీల ఆదాయాన్ని పెంచడానికి కృషి చేయాలని డీఎల్‌పీవో నూర్జహాన్ సూచించారు. మంగళవారం



ఎరువులను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో

ఎమ్మిగనూరు బైపాస్‌లో నిర్మించిన చెత్త నుంచి సంపద కేంద్రాలను పరిశీలించారు. అనంతరం 60కేజీల వానపాములను వదిలారు. వర్మికంపోస్టు తయారు చేసి, రైతులకు విక్రయించి, ఆ నగదును పంచాయతీ ఖాతాల్లో జమ చేస్తామన్నారు. సకాలంలో ఇంటి పన్నులు వసూలు చేయాలని సిబ్బందికి సూచించారు. డిప్యూటీ ఎంపీడీవో జనార్దన, కార్యదర్శి చంద్రశేఖర్ ఉన్నారు.

విత్తనాలను వినియోగించుకోండి



వేరుశనగ విత్తనాలను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

దేవనకొండ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే రాయితీ వేరుశనగ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ నాయకులు కప్పట్రాళ్ల మల్లికార్జున సూచించారు. మండలంలోని కప్పట్రాళ్ల రైతుసేవా కేంద్రంలో మంగళవారం రాయితీ వేరుశనగ విత్తనాలను పంపిణీ చేశారు. ప్రభుత్వ ప్రోత్సాహాన్ని రైతులు ఉపయోగించుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. వీహెచ్ఏ శివలింగం, టీడీపీ నాయకులు పెద్దకొలుట్లయ్య, రవికుమార్, గిడ్డయ్య, సురేంద్ర పాల్గొన్నారు.

హాస్టళ్లను పునఃప్రారంభించాలి

దేవనకొండ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని డీఎన్‌టీ, తెర్నేకల్ గ్రామంలోని ఎస్సీ బాలుర హాస్టళ్లను తిరిగి ప్రారంభించాలని ఏబీఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి శరత్‌కుమార్ డిమాండ్ చేశారు. మోడల్ పాఠశాల



వినతిపత్రం ఇస్తున్న ఏబీఎస్ఎఫ్ నాయకులు

సౌకర్యాలు లేవని సాకుతో హాస్టళ్లను ఎత్తివేయడం అన్యాయమన్నారు. అలాగే తెర్నేకల్ గ్రామంలోని బీసీ బాలుర, బాలికల హాస్టల్లో సౌకర్యాలు కల్పించాలన్నారు. అనంతరం తహసీల్దార్ ప్రసాదరావుకు వినతిపత్రం అందజేశారు. మధు, భరత్, ఈశ్వర్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని నాశనం చేసిన వైసీపీ

● టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర



తుగ్గలి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్లలో ఎలాంటి అభివృద్ధి పనులు చేయకుండా రాష్ట్రాన్ని వైసీపీ ప్రభుత్వం నాశనం చేసిందని టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర అన్నారు. మంగళవారం తుగ్గలిలోని తన నివాసంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. జూన్ 4వ తేదిన ప్రజలు జగన్ వెన్నుపోటు విముక్తి దినంగా నిర్వహించాలన్నారు. రాష్ట్రానికి వచ్చిన రూ.10లక్షల కోట్ల పెట్టుబడులను వెనక్కు పంపించి నిరుద్యోగుల కడుపు కొట్టారన్నారు. ఉద్యోగాలు లేక యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడ్డారన్నారు. జీవో నెం.117తో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 5 లక్షల మంది విద్యార్థులను పాఠశాలల నుంచి గెంటివేసి విద్యార్థులకు వెన్నుపోటు పొడిచింది జగన్ కాదా అని ప్రశ్నించారు. గత ఐదేళ్లలో ఒక్క టీచర్ పోస్టును కూడా భర్తీ చేయలేదన్నారు. పంచాయతీలకు రూపాయి కూడా ఇవ్వకుండా పక్కదోవ పట్టించారన్నారు. మద్య నిషేధం పేరుతో రాష్ట్రంలో మద్యం ఏరులై పారించారన్నారు. తన జేబు నింపుకోడానికి ప్రజలను వెన్నుపోటు పొడిచిన జగన్‌ను కాదని సీఎం చంద్రబాబు నాయుడను వెన్నుపోటుదారుడు అని వైసీపీ నాయకులు అనడం హాస్యాస్పదమని నాగేంద్ర అన్నారు.

వెన్నుపోటు దినానికి తరలిరండి



మాట్లాడుతున్న ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి

ఆలూరు, జూన్3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతూ తలపెట్టిన వెన్నుపోటు దినానికి తరలి రావాలని ఎమ్మెల్యే విరుపాక్షి పిలుపునిచ్చారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా హామీలు ఎంతవరకు అమలు చేశారని ప్రశ్నించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీ ఏమైందని, సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయకుండానే దగా చేసిందన్నారు. బాస్కర్, అరికెర ఉరుకుందు, శ్రీనివాసులు, వీరేష్, గిరి, మల్లయ్య, తిక్కస్వామి, రాజు పాల్గొన్నారు.

వైసీపీ నాయకులకు బుద్ధి రాలేదు



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

పత్తికొండ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రజలు 11 సీట్లతో బుద్ధిచెప్పినా వైసీపీ నాయకులకు బుద్ధి రాలేదని టీడీపీ నాయకులు రామనాయుడు, సోమ్లానాయక్, కడవల సుధాకర్ అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో సాంబశివారెడ్డి ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. మండలంలోని దూదెకొండకు చెందిన యువకుడు మట్కా, బెట్టింగ్‌కు అలవాటు పడి అప్పులపాలయ్యాడన్నారు. కొద్ది రోజుల క్రితం సొంత బావపై దాడి చేశాడని, అప్పుల బాధ తప్పించుకునేందుకే ప్రదీప్ ఓ తప్పుడు సెల్ఫీ వీడియోను మీడియాలో పెట్టాడన్నారు. నిజాలు తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు. శ్రీనివాసులు, మనోహర్‌చౌదరి, గోవిందు, పరమేశ్వరనాయుడు, కనకదిన్నె శ్రీనివాసులుగౌడు, చక్రలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సభను జయప్రదం చేయండి

పత్తికొండ టౌన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 5న విజయవాడలో జరిగే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల మహాసభను జయప్రదం చేయాలని నియోజకవర్గ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రియాజ్ బాషా, ట్రెజరర్ దివాకర్ పిలుపునిచ్చారు. మంగళవారం మాట్లాడుతూ 12వ పీఆర్సీ ఏర్పాటు చేయాలని, ఆర్థిక బకాయిలను చెల్లించాలన్నారు.

తెనాలి ఘటనలో సీఐలను తొలగించాలి

● మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మహానంది



మాట్లాడుతున్న మహానంది

ఆస్పరి, జూన్3 (ఆంధ్రజ్యోతి): పోలీసులు చేతుల్లోకి తీసుకుని ప్రవర్తిస్తున్నారని తెనాలి ఘటనలో సీఐలను తొలగించాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు గుడిసె మహానంది డిమాండ్ చేశారు. మంగళవారం ఆస్పరిలో మాట్లాడుతూ రెండు రోజుల్లో తెనాలిలో రెండు ఘటనలు చోటుచేసుకున్నాయి, యువకులను దారుణంగా హింసించిన ఇద్దరు సీఐలను వెంటనే విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. రాష్ట్ర హోం మంత్రి అనిత దళితురాలైనా దాడిని సమర్థించడం శోచనీయమన్నారు.

ఇరవై రోజుల నుంచి తాగునీరు రాలేదు

మద్దికెర, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): తమ కాలనీలో 20 రోజుల నుంచి తాగునీరు రావడం లేదని బీరప్ప గుడి వీధి మహిళలు డిప్యూటీ ఎంపీడీవో శివకుమార్, పంచాయతీ సెంహదారులు ఆంజనేయులుకు మంగళవారం విన్నవించారు. తాగునీరు రాకపోవడంతో బావులకు వెళ్లి నీరు తెచ్చుకుంటున్నామన్నారు. స్పందించిన డిప్యూటీ ఎంపీడీవో శివకుమార్ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

హాలహర్వి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఎంపీడీవో వరలక్ష్మి సూచించారు. మంగళవారం బాపురం గ్రామంలో 2 వేల మొక్కలు నాటారు. ఊరంతా పచ్చని తోరణంగా మార్చాలన్న గ్రామస్థులు తీసుకున్న నిర్ణయం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. సర్పంచ్ భాగ్యలక్ష్మి టీడీపీ నాయకులు ప్రహ్లాదరెడ్డి, గోవర్దన్, రామరాజు, కృష్ణ, చెన్నప్పచారి, నాగన్నగౌడ్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న యోగా పోటీలు

ఆదోని రూరల్, జూన్ 3 ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీపీ భవన్‌లో యోగా పోటీలు రెండోరోజు కొనసాగాయి. గ్రామాల నుంచి చిన్నారులు, మహిళలు, పురుషులు పాల్గొన్నారు. ఎంపీడీవో రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ ఇక్కడి విజేతలను జిల్లా పోటీలకు పంపుతున్నామని, ఈనెల 7వరకు పోటీలు ఉంటాయన్నారు.

పత్తి విత్తేందుకు తొందరపడవద్దు

ఆదోని అగ్రికల్చర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పత్తి విత్తేందుకు చాలా సమయం ఉందని తొందరపడవద్దని మండల వ్యవసాయ అధికారి అశోక్ కుమార్ రెడ్డి సూచించారు. సూచించారు. మంగళవారం మాట్లాడుతూ



ఏవో అశోక్ కుమార్

పదునైన వర్షం కురిసిన అనంతరమే విత్తనాలు వేయాలన్నారు. కొందరు రైతులు అడపా దడపా కురిసే వర్షానికే పత్తి విత్తనాలు వేస్తే ఎండవేడికి మొలకెత్తక నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ఎరువులు, విత్తనాలను కొనే సమయంలో దుకాణాల యజమానుల నుంచి తప్పకుండా రసీదు తీసుకోవాలని సూచించారు. రాయితీ వేరుశనగ విత్తనాలు కావలసినవారు సమీప రైతు సేవా కేంద్రాల్లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఏవో కోరారు.

చికిత్స పొందుతూ మృతి

ఆదోని, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శివశంకర్ నగర్‌కు చెందిన యువకుడు హరి (24) చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాల మేరకు.. ఈనెల 31వ తేదీన పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. తల్లిదండ్రులు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక మంగళవారం మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రేషన్ సక్రమంగా ఇవ్వాలి

ఆదోని రూరల్, జూన్ 3 ఆంధ్రజ్యోతి) : కార్డుదారులకు రేషన్ సక్రమంగా ఇవ్వాలని తహసీల్దార్ శివరాముడు సూచించారు. మంగళవారం రెవెన్యూ భవన్‌లో డీలర్లు, వీఆర్ఓ, వీఆర్ఏలతో సమావేశం నిర్వహించారు. 1వ తేదీ నుంచి 15వరకు లబ్ధిదారులకు అందేలా చూడాలన్నారు. డీటీ గుండాల నాయక్, సీఎస్ డీటీ వలి బాషా పాల్గొన్నారు.

ప్రయాణికురాలి మృతి

వెల్దుర్తి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని బోగోలు గ్రామానికి చెందిన ప్రయాణికురాలు గొల్ల అయ్యమ్మ(56) మంగళవారం గుండెపోటుతో మృతిచెందింది. వివరాలు.. భర్త అయ్యన్న, కూతురు వెంకటేశ్వరితో కలిసి బస్సులో కర్నూలుకు బయలుదేరారు. మార్గమధ్యంలో బస్సు వెల్దుర్తి పాతబస్టాండుకు చేరుకోగానే అయ్యమ్మ ఛాతిలో నొప్పిగా ఉందని బస్సులో కుప్పకూలింది. ఆటోలో వెల్దుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

జగన్‌ను ప్రజలు నమ్మరు

ఆలూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్‌ను ప్రజలు నమ్మరని గుంటూరు జిల్లా పత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. మంగళవారం పట్టణంలో విలేకరులతో మాట్లాడుతూ జగన్ తన ఉనికి కోసమే వెన్నుపోటు నిరసన నిర్వహిస్తున్నాడన్నారు. సీఎం చంద్రబాబు ఇప్పటికే 70 శాతం హామీలను నెరవేర్చారన్నారు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్, నాయకులు ఉన్నారు.

దినచర్యలో యోగా భాగం కావాలి

దేవనకొండ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): దినచర్యలో యోగా భాగం కావాలని ఎంపీడీవో టీవీ రమణరావు సూచించారు. మంగళవారం కార్యాలయంలో పొదుపు మహిళలకు యోగాసనాలుచేయించారు. వెలుగు ఏపీఎం నర్సన్న, సీసీలు, వీవోలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు జగన్ వెన్నుపోటు

● మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు



ఆదోని, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ ప్రజలకు వెన్నుపోటు పొడిచారని తన వైఫల్యాలు కప్పిపెట్టు దానికే డ్రామా ఆడుతున్నట్లు మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు ఆరోపించారు. మంగళ వారం రాత్రి మాట్లాడుతూ జగన్ అరాచక పాలన నుంచి విముక్తి పొందిన రోజు జూన్4 అన్నారు. వైసీపీ నాయకులు ప్రజా తీర్పు వెన్ను పోటులా కనిపిస్తోందంటే ప్రజాస్వామ్యంపై వారికి ఎంత గౌరవం ఉందో స్పష్టమవుతోందన్నారు. కాంగ్రెస్ పార్టీని అడ్డం పెట్టుకుని రూ.లక్షల కోట్లు దోచుకుని, అదే పార్టీకి వెన్నుపోటు పొడిచి వైసీపీ పార్టీని స్థాపించడం వెన్నుపోటు కాదా అని ప్రశ్నించారు.

హత్యా రాజకీయాలను ప్రోత్సహించిన జగన్



మాట్లాడుతున్న ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్

● ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్

ఆలూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): వెన్నుపోటు రాజకీయాలు చేసి హత్యా రాజకీయాలను ప్రోత్సహించిన చరిత్ర జగన్‌దే అని టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ ఆరోపించారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శివకుమార్ స్థాపించిన వైసీపీని కబ్జా చేశారన్నారు. హత్యా రాజకీయాలను ప్రోత్సహించారని, కుంభకోణాల నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికే దగ్గాల పేరిట డ్రామాకు తెరలేపారన్నారు. ఆస్తి కోసం చెల్లెని కూడా కాదన్న చరిత్ర ఎవరిదో రాష్ట్ర ప్రజలకు తెలుసునన్నారు. గత ప్రభుత్వంలో డీఎస్సీ హామీపై మాట తప్పి యువతను వెన్నుపోటు పొడిచారన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 70 శాతం హామీలు అమలు చేశారన్నారు. అమ్మకు వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం రెండు నెలల్లో అమలు చేస్తామన్నారు. దీపం కింద ఉచిత సిలిండర్లు, పింఛన్లపెంపు, అన్న క్యాంటీన్లను అమలు చేశామన్నారు. సర్పంచ్ నాగరాజు, నాయకులు బసప్ప, రామాంజనేయులు, విశ్వేశ్వరస్వామి, బసప్ప, ముద్దురంగ, గూళ్యం రామాంజనేయులు, ఆంజనేయ, మల్లేష్, కిట్టు, రామయాదవ్, హనుమప్ప పాల్గొన్నారు.

పన్ను వసూళ్లకు ప్రణాళిక

మద్దికెర, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో ఇంటి పన్నులను వందశాతం వసూలు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు పత్తికొండ డీఎల్‌పీవో వీరభద్రప్ప అన్నారు. మంగళవారం పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. స్వర్ణ పంచాయతీ కింద ఆన్‌లైన్ చేస్తున్నామని, పన్నులు సకాలంలో చెల్లించి పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. పన్నులు వసూళ్లలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో నీటి సమస్య రాకుండా అందరికీ సక్రమంగా నీరందించాలన్నారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రలో భాగంగా ప్రతి మూడో శనివారం పారిశు ద్ధ్యంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నా మన్నారు. ట్యాంకులను 15 రోజులకు ఒకసారి శుభ్రం చేయాలని, పరిసరాలు పరిశు భ్రంగా ఉంచుకోవాలన్నారు. అధికారులు గ్రామాల్లో పర్యటించి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. డిప్యూటీ ఎంపీడీవో శివకుమార్, పంచాయతీ కార్యదర్శులు సుదాకర్, పరమేశ్వరప్ప, హరికృష్ణ, వన్నూరప్ప, మంజునాథ్ తదితరులు ఉన్నారు.

గిరిజనుల అభివృద్ధికి కృషి




వెంకటపతిని సన్మానిస్తున్న గిరిజన నాయకులు

తుగ్గలి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల అభివృద్ధికి కృషి చేస్తానని, తనపై నమ్మకంతో గిరిజన సభా మండలి సభ్యుడిగా వెంకటపతి అన్నారు. మంగళవారం విజయవాడలో తెలుగుదేశం పార్టీ గిరిజన ఆత్మీయ సదస్సు నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు కొండారెడ్డి నరహరి వరప్రసాద్ ఆధ్వర్యంలో వెంకటపతిని సన్మానించారు. టీడీపీ ప్రభుత్వం గిరిజనుల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో జగన్ గిరిజనుల పథకాలన్నీ రద్దు చేసి వెన్నుపోటు పొడిచారని ఆరోపించారు. వెన్నుపోటు పొడవడం అలవాటు మాజీ సీఎం జగన్‌కే ఉందని, సీఎం చంద్రబాబుపై ప్రజలు నమ్మకంతో ఉన్నారన్నారు. తుగ్గలి మండలంలో మాజీ ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి తండాలకు బీటీ రోడ్లు, సీసీ రోడ్లు వేశారన్నారు. ఆయన అడుగుజాడల్లోనే ఎమ్మెల్యే శ్యాంబాబు పనిచేస్తున్నారని తెలిపారు.

యువత డ్రగ్స్‌కు బానిస కావద్దు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

● జొన్నగిరి ఎస్ఐ మల్లికార్జున



తుగ్గలి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): యువత మత్తు పదార్థాలకు బానిస కావద్దని, బెట్టింగ్, ఆన్‌లైన్ గేమ్స్‌కు దూరంగా ఉండాలని జొన్నగిరి ఎస్ఐ మల్లికార్జున అన్నారు.

ప్రశ్న: చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారా?

జవాబు: గ్రామాల్లో ప్రత్యేక క్యాంపు ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నాం.

ప్రశ్న: నేరాల నియంత్రణ కు ఏ చర్యలు తీసుకున్నారు?

జవాబు: జొన్నగిరి స్టేషన్ పరిధిలో దొంగతనాలు, నేరాల నియంత్రణకు గ్రామాల ప్రధాన కూడళ్లు, ఆలయాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. ప్రతిరోజు పికెట్ నిర్వహిస్తున్నాం.

ప్రశ్న: రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు వివరించండి?

జవాబు: వాహనదారులకు రహదారి భద్రతా నియమాలు తెలియజేస్తూ రోజూ వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నాం. నిబంధనలను అతిక్రమించిన వారికి జరిమానా విధించి, ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న: అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు చర్యలు తీసుకున్నారా?

జవాబు: పేకాట, మట్కా, ఇతర అసాంఘిక కార్యకలాపాలపై ప్రజలు పోలీసులకు సమాచారం ఇవ్వాలని గ్రామాల్లో పోస్టర్లు వేశాం. ప్రతి రోజు గ్రామాల్లో పోలీస్ బీట్ నిర్వహిస్తున్నాం. నిందితులపై బైండోవర్ కేసులు నమోదుచేసి నియంత్రిస్తున్నాం.

ప్రశ్న: పల్లెనిద్ర చేస్తున్నారా?

జవాబు: ఎస్సీ, బీసీ కాలనీల్లో నెలకు రెండుసార్లు సమస్యాత్మక గ్రామాల్లో పల్లెనిద్ర చేస్తున్నాం.

ప్రశ్న: శక్తి యాప్‌పై మహిళలకు అవగాహన కల్పిస్తున్నారా?

జవాబు: గ్రామాల్లో శక్తి యాప్‌ను వివరించి మహిళా చట్టాలపై అవగాహన కల్పిస్తున్నాం. రక్షణ అవసరమైన మహిళలు పోలీసులను సంప్రదించాలి. బాధితుల వివరాలు గోప్యంగా ఉంచడంతోపాటు ఎప్పటికప్పుడు కౌన్సిలింగ్ ఇస్తున్నాం.

ప్రశ్న: సైబర్ నేరాలు అరికట్టడానికి ఏమి చేస్తున్నారు?

జవాబు: మోసగాళ్ల వలలో పడవద్దని ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం. ప్రతి వారం క్యాంపులు ఏర్పాటు చేసి సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్నాం. అజ్ఞాత వ్యక్తుల ఫోన్‌కాల్స్, మెసేజ్‌లకు స్పందించవద్దని వివరిస్తున్నాం.

నాసిరకం విత్తనాలతో జాగ్రత్త

● విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు కొనుగోలులో అప్రమత్తంగా ఉండాలి ● రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

గోనెగండ్ల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ముందస్తుగానే ప్రారంభం అవుతోంది. వర్షాలు కూడా ముందే కురవడంతో విత్తనాలు నాటేందుకు వీలుగా పంట భూములు కూడా పదును అవుతున్నాయి. ఎమ్మిగనూరు, ఆదోని డివిజన్‌లలో ఎక్కువగా పత్తి సాగుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. రైతులు కూడా విత్తనాలు విత్తి, ఎరువులు చల్లుకునేందుకు సిద్ధమవుతుండటంతో పలు గ్రామాల్లో రైతులకు వ్యవసాయశాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు కొనుగోలు చేసే సమయంలో ఒక్కసారి ఆలోచించి నాసిరకం విత్తనాలు అమ్మే వ్యాపారులు వలలో పడకుండా ఆలోచించి మంచి విత్తనాలు కొనుగోలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నకిలీ విత్తనాల వ్యాపారం చేస్తున్న తెలంగాణా వాసులు

రైతుల అమయకత్వాన్ని ఆసరగా తీసుకుని కొందరు నాసిరకం విత్తనాలను అమ్మడానికి సిద్ధమయ్యారు. భూములు వర్షంకు తడిసి పదును కావడంతో రైతులు సాగుకు సిద్ధపడుతున్నారు. గోనెగండ్ల మండలంలోని బైలుప్పల, గంజహళ్లి, అగ్రహారం, ఐరన్‌బండ, ఎన్నెకండ్ల గోనెగండ్ల, అలువాల తదితర గ్రామాలలో తెలంగాణా ఐజ, మహబుబ్‌నగర్, తదితర ప్రాంతాలకు చెందిన కొందరు పత్తి విత్తనాల


ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏడీఏ (ఫైల్)


ఎరువుల బస్తాలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు (ఫైల్)

వ్యాపారులు గ్రామాల్లో తిరుగుతూ రైతులకు నాసిరకం విత్తనాలను అమ్ముతున్నారు. పొద్దుపొడవగానే రైతుల ఇండ్లకు పోయి విత్తనాలు అమ్మకాలు జరుపుతున్నారు. అందులోను ధర కాస్త తక్కువగా ఉండటంతో రైతులు కూడా ఆ విత్తనాలనే కొంటున్నారు. అమ్మకాలు జరిపిన వెంటనే వ్యాపారులు ఉదయం 9 గంటల లోపే గ్రామం వదలి పోతున్నారు. ఇప్పటికే గ్రామాల్లో దాదాపు రెండు వందల మంది రైతులు ఈ విత్తనాలు కొనుగోలు చేశారు. అక్రమంగా గ్రామాలలో అమ్మకాలు జరుపుతున్న విత్తనాల వ్యాపారులపై వ్యవసాయ శాఖ అధికారులు డేగ కన్ను పెట్టాల్సిన అవసరం ఉంది.

విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు:

రైతులు వ్యవసాయ శాఖ అనుమతి పొందిన డీలర్స్ దగ్గర మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలి. బయట దళారుల దగ్గర విత్తనాలను కొనకూడదు. ఈ దళారులు అమ్మకాలు జరిపే విత్తనాల దగ్గర నాణ్యత ఉండదు. డీలర్ దగ్గర కొన్న పత్తి విత్తనాల ప్యాకెట్‌కు తప్పకుండా బిల్లు తీసుకోవాలి. ఈ బిల్లులో రైతు పేరు, గ్రామం పేరు, రైతు ఫోన్ నెంబర్, విత్తన రకం, లాట్ నెంబరు, తయారి, గడువు తేది తప్పకుండా ఉండేవిధంగా చూసుకోవాలి. ఈ బిల్లులో రైతు, డీలర్ సంతకం తప్పని సరిగా ఉండాలి. చిరిగిని విత్తన సంచులను, ప్యాకెట్‌లను కొనరాదు. రైతు తీసుకున్న బిల్లు పంటకాలం పూర్తిఅయ్యేవరకు జాగ్రత్తగా ఉంచుకోవాలి. పంట కాలంలో మొలక రాకపోయిన, పంట సరిగా పండక పోయినా ఈ బిల్లే రైతుకు శ్రీరామరక్ష. విత్తనాలు మొలకెత్తకపోతే నష్టపరిహారం పొందేందుకు రైతుకు వీలు ఉంటుంది.

ఎరువుల కొనుగోలులో...

ఎరువులు కూడా వ్యవసాయ శాఖ అధికారులు ఇచ్చిన లైసెన్స్ పొందిన దుకాణంలో మాత్రమే ఎరువులు, పురుగు మందులు కొనాలి. గ్రామాల్లో రాత్రి పూట వచ్చి తక్కువ ధరకు ఎరువులు అమ్ముతామనే వారి దగ్గర ఎట్టి పరిస్థితుల్లో ఎరువులను కొనవద్దు. గ్రామాల్లో ఇలా ఎవరైన అమ్మకాలు జరిపేందుకు వస్తే వెంటనే వ్యవసాయశాఖ అధికారులకు తెలియజేయాలి. సేంద్రియ ఎరువులని మోసం చేసేందుకు వచ్చిన వ్యాపారులతో జాగ్రత్తగా ఉండాలి.

రైతులకు అవగాహన కలిస్తున్నాం



ఏ ఖరీఫ్ సీజన్ రైతులకు ఆశాజనకంగా ఉంది. వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నాయి. రైతులు పంటలు వేస్తున్నారు. నాసిరకం విత్తనాలు, ఎరువుల, పురుగుల మందులను అమ్మేవారు గ్రామాల్లో తిరిగి రైతులకు మాయ మాటలు చెప్పి మోసం చేసి అమ్మి పోతుంటారు. వారి పై ప్రత్యేక నిఘా గ్రామస్థులు ఏర్పాటు చేశాం. రైతులకు పంటలు సాగు చేసే విషయంలోను, నకిలీ విత్తనాలను గుర్తించే విషయంలోను అవగాహన ను రైతుసేవ కేంద్రం సిబ్బంది ద్వార కల్పిస్తున్నామన్నారు.

-మహమ్మద్ ఖాద్రీ, ఏడీఏ, ఎమ్మిగనూరు.

వైసీపీ హయాంలో అక్రమ కనెక్షన్లు : టీడీపీ


పంప్‌హౌస్‌ను పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

నందవరం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయంలో ఇష్టానుసారంగా గురురాఘవేంద్ర ప్రాజెక్టు కింద అక్రమ కనెక్షన్లు ఇచ్చి రైతుల దగ్గర లక్షల్లో వసూలు చేసుకున్నారని టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌చార్జులు కాశీంవలీ, ధర్మాపురం గోపాల్ ఆరోపించారు. మంగళవారం మండలంలోని నాగలదిన్నె గ్రామం దగ్గర ప్రాజెక్టు కింద పంప్‌హౌస్‌ను టీడీపీ నాయకులు పరిశీలించారు. గతంలో వైసీపీ నాయకులు నాగలదిన్నె ఎత్తిపోతల కింద 70 ఎకరాలకు అక్రమంగా కనెక్షన్లు ఇచ్చి రైతుల దగ్గర నుంచి లక్షల్లో వసూళ్లు చేసుకున్నారని మండిపడ్డారు. టీడీపీ హయంలో రైతులు స్వతహాగా పైపులైన్లు వేసుకునేందుకు అవకాశం కల్పించిందన్నారు. రైతుల పక్షాన నిలబడే ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వరరెడ్డి రైతులకు అన్యాయం చేయరనే విషయం గురు పెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఈరన్న, ఎమ్మిగనూరు మార్కెట్‌యార్డు డైరెక్టర్ సుధీర్, బ్రహ్మానందరెడ్డి, బోటు వీరేష్, ఆదిశేషు, సత్యారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఎరువులు అందించాలి



ఏవో కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న నాయకులు

ఎమ్మిగనూరు, జూన్3 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్ ప్రారంభమైందని రైతులకు ప్రభుత్వం నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించాలని ఏపీఆర్‌సీఎస్ నాయకులు ఏసేపు డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని ఏఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు అప్పులు చేసి సాగుకు సిద్ధమవుతున్నారన్నారు. విత్తనాలకోసం దుకాణాల దగ్గరకు వెళ్తే పత్తివిత్తనాలు, ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. అంతేగాక పక్క రాష్ట్రాలనుంచి నాసిరకం విత్తనాలను తెచ్చి ఇక్కడ అధికధరలకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి దుకాణాలపై వ్యవసాయ అధికారులు తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు చేపడతామన్నారు. అనంతరం కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం ఇచ్చారు. నాయకులు శాంసన్, జయన్న, షుడక్, మాబు హుసేని, ఐఎఫ్‌టీయు నాయకులు హనీఫ్, కిష్టప్ప, పీడీఎస్‌యూ నాయకులు సాయితేజ, ఇర్ఫాన్, ఆరీఫ్, నరసింహులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన హెచ్‌ఎంలు

కోసిగి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టిన విషయం తెలిసేందే. ఇందులో భాగంగా కోసిగి బాలికల ఉన్నత పాఠశాలకు ప్రధానోపాధ్యాయులుగా గడ్డం పరిమళా దేవి, అలాగే కోసిగిలోని బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా శ్రీనివాసులు బాధ్యతలు స్వీకరించారు. మంగళవారం ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కర్నూలులోని ప్రభుత్వ ఉర్దూ బాయ్స్ హై స్కూల్‌లో స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీషు ఉపాధ్యాయునిగా పని చేస్తూ పదోన్నతిపై కోసిగి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు ప్రధానోపాధ్యాయురాలిగా రావడం జరిగిందన్నారు. పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తామని హెచ్‌ఎంలు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు వారిని కలిసి అభినందించారు.

తాగునీటి సమస్య తీరనుంది

● ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరెడ్డి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



గోనెగండ్ల, జూన్ 3(ఆంధ్రజ్యోతి): గోనెగండ్ల మండలంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో చేపడుతున్న జలజీవన్ మిషన్ పనులతో అన్ని గ్రామాలలో తాగునీటి సమస్య తీరనుంది. పనులు వేగవంతంగా జరిగేవిధంగా చర్యలు తీసుకుంటున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలో ప్రస్తుతం ఏగ్రామాంలో కూడా తాగునీటి సమస్య లేదని సమస్య రాకుండా తగిన చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు.

ప్రశ్న: గోనెగండ్ల మండలానికి జలజీవన్ మిషన్ కింద ఎన్ని నిధులు విడుదల అయ్యాయి?

జవాబు: గోనెగండ్ల మండలం లోని 28 గ్రామాలకు గాను తాగునీటి సమస్య తను పరిష్కరించేందుకు గాను జలజీవన్ మిషన్ కింద రూ. 34.22 కోట్లు విడుదల అయ్యాయి. అందులో బాగంగా పనులు చేసేందుకు కృషి చేస్తున్నాము.

ప్రశ్న: మండలంలో ఎన్నిగ్రామాలలో పనులు చేస్తున్నారు?

జవాబు: మండలంలోని 28 గ్రామాలలో పనులు చేసేందుకు కాంట్రాక్టర్‌లు ముందుకు వచ్చారు. అందులో కొన్ని గ్రామాలలో ఇప్పటికే పనులు మొదలు పెట్టారు. పనులను శరవేగంగా జరిపేందుకు మా వంతు కృషి చేస్తున్నాము.

ప్రశ్న: గోనెగండ్లలో జలజీవన్ పనులు ఏలా జరగనున్నాయి?

జవాబు: మండల కేంద్రమైన గోనెగండ్లకు జలజీవన్‌మిషన్ కింద రూ.2.50 కోట్లు విడుదల అయ్యాయి. ఈ పనులను ప్రారంభమయ్యాయి. కొన్ని కాలనీలో పనులు పూర్తి కూడా అయ్యాయి. ఇప్పటికే గోనెగండ్లలో ఒక ఓహెచ్‌ఆర్ ట్యాంక్ పనుల దాదాపు పూర్తి అయ్యాయి. ఈ పనులు పూర్తి అయితే ఇక గోనెగండ్లకు తాగునీటి సమస్య తీరినట్లే.

ప్రశ్న: మండలంలోని మిగతా తాగునీటి పథకాల పరిస్థితి ఏమిటీ?

జవాబు: మండలంలోని అలువాల గ్రామాలలో ఎస్ఎస్ ట్యాంక్ నుంచి 9 గ్రామాలకు తాగునీర వెలుతుంది. అయితే రూ. 32 లక్షలతో పిల్టర్ బెడ్స్ ఏర్పాడు చేసి గ్రామాలకు క్లియర్ నీటిని విడుదల చేస్తున్నాము. మండలంలో 178 చేతి బోర్లకు గాను 146 చేతి బోర్లు పని చేస్తున్నాయి. అలాగే పీడబ్ల్యూఎస్, ఎంపీడబ్ల్యూఎస్ నీటి పథకాలు మండలంలో 58 ఉన్నాయి. అన్ని పూర్తి స్థాయిలో పనిచేస్తున్నాయి.

మంచాలమ్మకు విశేషాభిషేకం


దేవతను సుందరంగా అలంకరించిన దృశ్యం

మంత్రాలయం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయంలో వెలసిన గ్రామదేవత మంచాలమ్మ దేవతకు మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు చేతుల మీదుగా సుగంధ ద్రవ్యాలతో విశేషాభిషేకం నిర్వహించారు. మంగళవారం జ్యేష్ఠ మాస అష్టమి శుభదినాన్ని పురష్కరించుకొని పీఠాధిపతి ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్మలవిసర్జనం, క్షీరాభిషేకం, కుంకుమ సేవ, సుగంధ ద్రవ్యాలతో విశేష పంచామృతాభిషేకం చేసి పసుపు, గందం, పట్టుచీర, బంగారు, వెండి ఆభరణాలుతో పాటు వివిధ రకాల పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. ఇది భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు నదిలో పుణ్యస్నానాలు ఆచరించి మంచాలమ్మను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

● శ్రీ మఠానికి రూ.2 లక్షల విరాళం

బెంగళూరు చెందిన రవిరంగా అనేభక్తుడు రూ.2 లక్షలు దైనందిక సంపూర్ణ అన్నదానంకు విరాళంగా ఇచ్చినట్లు మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషిసురేష్ కోణాపూర్ లు తెలిపారు. మంగళవారం కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని రూ. 2 లక్షలు నగదు రూపంలో విరాళం ఇచ్చినట్లు తెలిపారు. విరాళం ఇచ్చిన దాత కుటుంబానికి పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు రాఘవేంద్ర స్వామి మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు. కార్యక్రమంలో జేపీ స్వామి, శ్రీపాద ఆచార్‌లు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలి



ఆశా కార్యకర్తలతో సమీక్ష నిర్వహిస్తున్న నోడల్ ఆఫీసర్

ఎమ్మిగనూరు, జూన్3(ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సంచార చికిత్స నోడల్ ఆఫీసర్ డా. రఘు సూచించారు. మంగళవారం పట్టణంలోని శిల్పా కాలనీలో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఆశావర్కర్లు, ఆరోగ్య కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గర్భవతి పేరు 12వారాలలోపు నమోదు చేసి వారికి అందించాల్సిన సేవలను సకాలంలో అందించి కాన్పు ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగేలా చూడాలన్నారు. అలాగే రక్తహీనతపై అవగాహన కల్పించి, ఆహార నియమాలు సక్రమంగా పాటించేవిధంగా తెలియజెప్పాలన్నారు. కాలానుగుణంగా వచ్చే వ్యాధులపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి విజయకృష్ణ, ప్రాజెక్టనిస్టు ఖలీల్, సచివాలయ ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

టీబీ నిర్మూలనకు కృషి చేద్దాం


టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా క్యాంపు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

కోసిగి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో టీబీ వ్యాధి నిర్మూలన కోసం కృషి చేయాలని ఆరోగ్య పర్యవేక్షకులు స్వరూప్, మెడికల్ ఆఫీసర్ డా.మనోజ్ కుమార్ అన్నారు. మంగళవారం కోసిగి సచివాలయంలో టీబీ ముక్త్‌భారత్ అభియాన్ టీబీ క్యాంపెయిన్ ఇంటెన్సిఫైడ్ టీడీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సక్రమంగా మందులు వాడితే టీబీ నయమవుతుందని, దీని గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డా.అభిరూప్, సామాజిక ఆరోగ్య అధికారిణి ఈశ్వరమ్మ, విస్తరణ అధికారులు ఎల్లప్ప, శ్రీనివాసులు, జయమ్మ, రాముడు, యామిని, మల్లికార్జున ఉన్నారు.

వాటర్ గ్రిడ్ పథకానికి రూ. 350 కోట్లు మంజూరు: ఎమ్మెల్యే


జల్ జీవన్ మిషన్ పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి

గోనెగండ్ల, జూన్ 3(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు వాటర్ గ్రిడ్ పథకానికి ప్రభుత్వం రూ. 350 కోట్లు మంజూరు చేసిందని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన గోనెగండ్లలో జలజీవన్ మిషన్ కింద రూ. 2.50 కోట్లతో నిర్మిస్తున్న ఓహెచ్‌ఆర్ ట్యాంక్‌ను ఆయన ప్రారంభించి కొళాయిలకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మిగనూరు నియోజకవర్గంలో ఉన్న మూడు మండలాలకు తాగునీటి సమస్య లేకుండా ఉండేందుకు వాటర్ గ్రిడ్ పథకంను ఏర్పాటు చేశామన్నారు. ఇందుకు కావాల్సిన నిధులను కూటమి ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి నీటిని మళ్లించి నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు సరఫరా చేస్తామన్నారు. ప్రస్తుతం గోనెగండ్ల మండలంలో గ్రామాలలో నెలకొన్న తాగునీట సమస్యను పరిష్కరించేందుకు గాను జలజీవన్ మిషన్ కింద రూ. 19 కోట్లు మంజూరు అయ్యాయని ఈ నిధులతో మండలంలోని అన్ని గ్రామాలలో నీటిపథకాలను ఏర్పాటు చేస్తామన్నారు. గోనెగండ్ల గ్రామంలో రూ. 2.50 కోట్లుతో మూడు ఓహెచ్‌ఆర్ ట్యాంక్‌లు ఏర్పాటు చేసి ప్రతి ఇంటికి ఉచితంగా కొళాయిని ఇస్తామన్నారు. వైసీపీ ప్రభుత్వం జలజీవన్ మిషన్ నిధులకు సక్రమంగా వినియోగించుకోక పోవడంతో నిధులు వెనక్కివెళ్లాయని మళ్లీ వాటిని తీసుకువచ్చి పనులు చేపడుతున్నామని తెలిపారు. మంజూరు అయిన నిధులతో కొత్తట్యాంక్‌లు, కొత్త పైప్‌లైన్ ఏర్పాటు చేసి నీటి విడుదల చేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కుమారస్వామి, ఎంపీడీవో మణిమంజరి, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, టీడీపీ నాయకులు నజీర్, తిరుపతయ్యనాయుడు, బేతాలబడేసా, రామాంజినేయులు, గ్రామ మేజర్ సర్పంచ్ హైమావతి, ఎమ్మిగనూరు మార్కెట్ యార్డు చైర్మన్ మల్లయ్య, అడ్వకేట్ చంద్రశేఖర్, రమేష్‌నాయుడు, రంగస్వామినాయుడు, నూరహమ్మద్, వినోద్‌గౌడ్, బారతం రహంతుల్లా, ఫకృద్దీన్, వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ రంగముని, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాన్ని కూల్చివేయాలి


ఎస్‌బీఐ బ్యాంకు ముందు అక్రమ కట్టడాన్ని చూపుతున్న రామక్కమ్మవ్వ కాలనీవాసులు

కోసిగి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కోసిగిలోని స్థానిక ఎస్‌బీఐ బ్యాంకు పక్కన ప్రధాన రోడ్డుపై ఆ కాలనీకి చెందిన ఓ ప్రముఖ రాజకీయ నాయకుడు అక్రమ కట్టడాన్ని నిర్మించాడని వెంటనే దాన్ని కూల్చివేయాలని రామక్కమవ్వ నగర్, ఎన్టీఆర్ నగర్ కాలనీవాసులు మంగళవారం కోసిగిలోని ప్రధాన రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. ఎస్‌బీఐ బ్యాంకు పక్కన, రోడ్డుపైన కాలనీకి అడ్డంగా దుకాణాలతో పాటు బ్యాంకు ఎక్కేందుకు ర్యాంపును నిర్మిస్తున్నారని దీన్న అడ్డుకోవాలని సుమారు వంద మంది కోసిగి ఎస్ఐ హనుమంతరెడ్డి, పంచాయతీ కార్యదర్శి తిరుమలేశ్వరరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు ఆ రోడ్డు గూండా వెళ్లడానికి ఇబ్బందిగా ఉందని ముఖ్యంగా బ్యాంకుకు వచ్చిన వారు రోడ్డుపైనే వాహనాలు పెట్టడంతో కాలనీల్లోకి ఎడ్లబండి, ట్రాక్టర్, బైకులు ఇతర వాహనాలు వెళ్లడానికి ఇబ్బందిగా ఉందని కాలనీవాసులు బండి అయ్యప్ప, రామయ్య, మూకోడు, కోసిగయ్య, సంజీవయ్య, శివన్న, కొండరాజు, తిక్కయ్య, లక్ష్మీ, ఎల్లమ్మ, వీరమ్మఉరుకుందమ్మతో పాటు మరో వంద మంది తెలిపారు. సమస్యను పరిష్కరించాలని కోరారు.

సజ్జలగుడ్డంలో వెలగని వీధి దీపాలు


ఎస్సీ కాలనీలోని ఓ వీధి

కోసిగి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సజ్జలగుడ్డం ఎస్సీ కాలనీలో గత నెల రోజుల నుంచి వీది దీపాలు వెలగకపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఆందోళనలకు గురవుతున్నారు. రెండు రోజుల్లోనే చర్చి సమీపంలో పాము కాటుకు ఇద్దరు గురి కావడంతో ఎస్సీ కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం రాత్రి ఎస్సీ కాలనీలోని చర్చి వద్ద అవినాష్ అనే విద్యార్థికి పాము కాటు వేయడంతో హుటాహుటిన ఆసుపత్రికి తీసుకెళ్లారు. అంతకుముందు రోజు మరో చిన్నారిని కూడా పాము కాటు వేయడంతో రెండు రోజుల్లోనే ఇద్దరు పిల్లలను పాము కాటు వేయడంతో కాలనీవాసులు భయాందోళనలకు గురవుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ విద్యుత్ అధికారులు స్పందించ వీధి లైట్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

దోమకాటుతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

గోనెగండ్ల, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమకాటుతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు రంగారవళి కోరారు. మంగళవారం మలేరియా వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా గోనెగండ్లలో వైద్యసిబ్బంది ర్యాలీ నిర్వహించారు. దోమల వల్ల కలిగే వ్యాధుల గురించి ప్రజలకు వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ దోమలు ప్రబలితే మలేరియా, డెంగ్యూ వ్యాదులు సోకుతాయన్నారు. అందుకే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఈ అవగాహన కార్యక్రమంలో వైద్య సిబ్బంది హనుమంతు, సుధాకర్, పరమేష్, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి


తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

గోనెగండ్ల, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు పంపన్నగౌడ్, సీనియర్ నాయకులు మద్దిలేటి నాయుడు, మండల సహాయ కార్యదర్శి మునిస్వామి డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో గోనెగండ్ల తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈసందర్భంగా సీపీఐ నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో గ్రామాల్లో నిరుపేదలకు మూడు సెంట్లు, పట్టణాలలో రెండు సెంట్ల స్థలం తోపాటు ఇంటి నిర్మాణానికి రూ. 5లక్షలు ఇస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా ఇప్పటి వరకు ఈ పథకాన్ని అమలు చేయలేదని వారు గుర్తు చేశారు. సూపర్ సిక్స్ పథకాలు ఇప్పటి వరకు ఒక్కటి కూడా అమలు చేయలేదని వారు విమర్శించారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్ కుమారస్వామికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బేతాల బాషా, సీపీఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మద్యం, మట్కా కేసుల్లో ఇద్దరు అరెస్టు

కోసిగి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జంపాపురం రోడ్డులో వందగల్లు, కోసిగి గ్రామానికి చెందిన నూకయ్య, పులియేసు రాజు ఇద్దరు వ్యక్తులు అక్రమ కర్ణాటక మద్యం అమ్మడంతో పాటు మట్కా చీటీలు రాస్తున్నారన్న సమాచారం మేరకు ఇద్దరిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ హనుమంతరెడ్డి తెలిపారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఎస్ఐ మాట్లాడుతూ వీరి వద్ద నుంచి మట్కా చీటీలు రూ.2,250 నగదు, 206 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపామని తెలిపారు.